# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

## నిజామాబాద్-కామారెడ్డి

గురువారం | ఏప్రిల్ 11, 2024 | www.navatelangana.com




## ఎక్సైజ్ పరిధిలో పలువురు బైండోవర్

నవతెలంగాణ-కామారెడ్డి



కామారెడ్డి ఎక్సైజ్ పరిధిలోని వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులను బుధవారం బైండోవర్ చేసినట్లు కామారెడ్డి ఎక్సైజ్ సిఐ విజయ్ కుమార్ తెలిపారు. ఈ బైండోవర్‌లో కామారెడ్డి పట్టణంలో బెల్ట్ షాప్ కేసులో ఇద్దరిని, రామారెడ్డి మండల పరిధిలో నాటసార అమ్మిన కేసులో ఏడుగురిని, మాచారెడ్డి మండలంలో నాటు సారాయి కేసులో ముగ్గురిని, మొత్తంగా 12 మందిని ఆయా మండలాల తహసీల్దార్‌ల ఎదుట బైండోవర్ చేసినట్టు తెలిపారు. ఈ బైండవర్లను ఉల్లంఘన చేసి తిరిగి కేసులలో పట్టుపడితే రెండు సంవత్సరాల జైలు శిక్ష లేదా రెండు లక్షల రూపాయల జరిమానా విధించనున్నట్టు తెలిపారు.

## పెండింగ్ డీఏ విడుదల చేయాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు బకాయిబడ్డ డిఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న డిఏలను ఎలక్షన్ కమిషన్ అనుమతి తీసుకొని విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరింది. జిల్లా అధ్యక్షులు కే. రామ్మోహన్‌రావు అధ్యక్షతన బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మెడికల్ బిల్లులు, పదవీ విరమణకు సంబంధించిన అనేక బిల్లును ఇప్పటికీ ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి ఎస్.మదన్‌మోహన్, ఉపాధ్యక్షులు బోజారావు, నిజామాబాద్ అధ్యక్షులు శిర్ప హనుమాన్లు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేశ్‌బాబు

# సర్వే చేపట్టి పంటనష్ట పరిహారం చెల్లించాలి

- సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

'గత రెండు రోజులుగా జిల్లాలో కురిసిన వడగండ్ల వానకు చేతికొచ్చిన వరి, మొక్కజొన్న పంట నేలకొరిగి గింజలు రాలిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అదేవిధంగా వర్షభావ పరిస్థితుల మూలంగా ఎండిపోయిన పంటలను వ్యవసాయ అధికారులు వెంటనే సర్వేలు నిర్వహించి ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం చొప్పున లెక్కగట్టి రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని' సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.

రైతులు ఎంతో కష్టపడి పండించిన పంట సభ పరిస్థితుల మూలంగా కొన్ని ప్రాంతాల్లో ఎండిపోవడంతో పాటు ఇటీవల కురిసిన వడగండ్ల వాన వలన బోధన్ డివిజన్‌లోని వివిధ మండలాల్లో జిల్లాలోని వివిధ గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని రైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని ప్రభుత్వం ఎన్నికల వంకతో తాత్సారం చేయకుండా రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. తిరిగి వారు పంటలు వేసుకోవటానికి రుణాలను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, పి వెంకటేష్, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే కాంగ్రెస్ బలం

- కుటుంబ పార్టీని ప్రజలు తిరస్కరించారు
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

నవతెలంగాణ-బిచ్కుంద



మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

కష్టపడి పనిచేసే కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలం అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలోని బండయప్ప కళ్యాణ మండపంలో బుధవారం పార్టీ ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్ల పరిపాలించిన కుటుంబ పార్టీని ప్రజలు తిరస్కరించారని గెలిచిన మూడు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో నాలుగు అమలు చేస్తున్నామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత మిగతా హామీలు నెరవేరుస్తామని, కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామస్థాయి నుండి ప్రజలను బలోపేతం చేసి పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ ను బారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు.

లెండి ప్రాజెక్ట్, నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. జుక్కల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో పూర్తిస్థాయి సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, అగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్, నారాయణఖేడ్, జుక్కల్ ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, తోట లక్ష్మీకాంతారావు, సీనియర్ నాయకులు ఉజ్వల్ రెడ్డి, మండల అధ్యక్షులు ధర్పల్లి గంగాధర్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో చేరన విండో చైర్మన్

మద్నూర్ : కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులై బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మద్నూర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ తెలిపారు. జుక్కల్ నియోజకవర్గం స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరైన రాష్ట్ర ఆరోగ్య శాఖ మాత్యులు దామోదర రాజనర్సింహ రాష్ట్ర నాయకులు అలాగే జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఆయనతోపాటు పెద్ద ఎక్లారా ఎంపీటీసీ సభ్యులు శంకర్ పటేల్ ఆ గ్రామ పెద్దలు తదితరులు కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.



మద్నూర్ : కాంగ్రెస్‌లో చేరుతున్న సొసైటీ చైర్మన్

# కూలీల సంఖ్య పెంచాలి

- పని ప్రదేశంలో సౌకర్యాలూ కల్పంచండి : డీఆర్‌డీవో
- సూపరింటెండ్, జూనియర్ అసిస్టెంట్‌కు మెమోలు జారీ



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న డీఆర్‌డీవో

నవతెలంగాణ-భిక్కనూర్

ఉపాధి హామీ పనులకు కూలీల సంఖ్య పెంచాలని, పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, డిఆర్‌డిఓబి చందర్ అధికారులను ఆదేశించారు. భిక్కనూరు మండలంలోని లక్ష్మీ దేవునిపల్లి, అంతంపల్లి గ్రామాలలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీలో పనులు చేపడుతున్న కూలీల వద్దకు వెళ్ళి పనితీరు, ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. ఆశా వర్కర్ల చేత కూలీ పని చేస్తున్న సమయంలో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచే విధంగా చూడాలన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. చేపల పెంపకం ఆక్వా పథకంలో భాగంగా రెండు లక్షల రూపాయల బ్యాంకు లింకేజీ లోన్ చెక్కును గ్రామానికి చెందిన శంకర్ కు అందజేశారు.

అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులు పరిశీలించి సూపరిండెంట్, జూనియర్ అసిస్టెంట్ కు మెమోలు జారీ చేశారు. ఉపాధి హామీ సామాజిక ఆడిట్ జరుగుతున్నందున సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు రికార్డులు అన్ని ఆర్డర్ కు అందజేయాలన్నారు. అనంతరం ఐకెపి కార్యాలయాన్ని సందర్శించి డ్వాక్రా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఏపిఎం శ్రీనివాస్ కు ఆదేశించారు. కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి నీటి సమస్య ఏర్పడితే అధికారులకు సమాచారం అందించి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్, ఐకెపి, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యలు రానీయొద్దు

- ధాన్యం కొనుగోలు వేగవంతం చేయండి
- అధికారులకు సీఎస్ శాంతికుమారి ఆదేశాలు

నవతెలంగాణ-కామారెడ్డి/నిజామాబాద్‌సిటీ



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరై మాట్లాడుతున్న కలెక్టర్

తాగునీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులను సత్వరమే పరిష్కరించాలని జిల్లాస్థాయి అధికారు లను ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. బుధవారం సచివాలయం నుంచి జిల్లాల కలెక్టరేట్‌లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. వేసవిలో తాగునీటి సరఫరా ప్రణాళిక, ధాన్యం కొనుగోలు, పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనపై, వడదెబ్బ తగలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కామారెడ్డిలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, చంద్రమోహన్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. నిజామాబాద్‌లో కలెక్టర్

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ వేసవికాలం పూర్తి చేసుకోని వర్షాలు వచ్చేవరకు తాగు నీటి సరఫరా అంశం పై అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో తాగు నీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు.

వార్తా పత్రికలలో, ఎలక్ట్రానిక్ మీడియాలో తాగునీటి సరఫరాకు సంబంధించి జిల్లాలో రూపొందిం చుకున్న ప్రణాళిక , నీటి సరఫరా లో ఎదురవుతున్న సమస్యలు, వాటిని పరిష్కరించేందుకు తీసుకుంటున్న చర్యలు , నీటి పునరుద్ధరణ వివరాలు తెలియజేయాలని అన్నారు. తాగు నీటి సంబంధించి ప్రజలు ఎక్కడ ఆందోళనలు చేయాల్సిన అవసరం లేకుండా చూసుకోవాలని సీఎస్ తెలిపారు.

## కబ్జా చేసినట్టు నిరుపిస్తే భూములు పంచేందుకు సిద్ధం

- కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ నాయకుల సవాల్

నవతెలంగాణ-భిక్కనూర్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కామారెడ్డి, ర్యాగట్లపల్లి, జంగంపల్లి గ్రామాలలో భూములు కబ్జా చేసినట్లు నిరూపిస్తే ఆ భూములు పంచడానికి మేము సిద్ధంగా ఉన్నామని, దమ్ముంటే నిరూపించి చూపించాలని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే బిఆర్ఎస్ నాయకులు ఊరుకోరని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమ్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారమిక్కడ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడాఉ. మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు. బర్ల కొట్టం నుంచి తీసుకొచ్చి గాల్ రెడ్డిని ఎంపీపీని చేసింది తమ నాయకుడు గంప గోవర్ధన్ అని, ఆ విషయం చెప్పాల్సింది గాల్ రెడ్డి కానీ తాను కాదని అన్నారు. 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఘనత మా గంప గోవర్ధన్ అని అతని గురించి మాట్లాడే ముందు ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మహేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తునికి వేణు, సొసైటీ చైర్మన్ భూమ్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి వైస్ ఎంపీపీ యాదగిరి పట్టణ అధ్యక్షులు మల్లేశం, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు సాయి రెడ్డి, ఎంపీటీసీ సాయ గౌడ్, నాయకులు దుర్గా రెడ్డి, నర్సారెడ్డి ప్రభాకర్, బసవయ్య, బాబు, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనేవారేరి..?

- కొనుగోలు కేంద్రాల కోసం రైతుల ఎదురుచూపులు
- తప్పని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



రోడ్డు పక్కన ఆరబెట్టిన మక్కలు

మొక్క జొన్న చేతికి వచ్చినా.. కొనుగోలు కేంద్రాల జాడ లేక రైతులు పడిగాపులు కాస్తున్నా రు. మార్క్‌ఫెడ్ స్పందించ కపోగా అధికారు లు, పాలకులు పట్టించుకోకపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. తప్పని పరిస్థితుల్లో పలువురు రైతులు దళారులకు మక్కలు విక్రయించుకుంటున్నారు.

పెద్దకొడప్‌గల్ మండలంలోని వివిధ గ్రామాలలో దాదాపు 500 ఎకరాలలో మొక్కజొన్నను రైతులు పండించారు. పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతుల దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులకు అమ్ముకొని నష్టపోతున్న రైతులు మండలంలో కొనుగోలు కేంద్రంలేక లబోదిబోమంటున్నారు.

కష్టపడి పండించిన పంట అమ్ముకునేందుకు ప్రతి ఏటా ఇబ్బందులు తప్పడంలేదు. సకాలంలో పంట దిగుబడులు వచ్చినా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటులో జాప్యం కావడంతో రైతుల పాలిట శాపంగా మారింది. చేసేదేమీ లేక దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం క్వింటాలుకు రూ.2,070 మద్దతు ధర ప్రకటించినప్పటికీ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతలు ఎక్కడ అమ్ముకోవాలో తెలియక అవస్థలు పడుతున్నారు. కొందరు ప్రైవేట్ వ్యాపారులు కల్లాల వద్దకే వచ్చి మక్కను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దాదాపు రూ.200 తక్కువగా ఇచ్చి రూ.1,950కే కొంటున్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే ధర పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కారు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని కర్షకులు కోరుతున్నారు. ఈ విషయమై అధికారులను సంప్రదించగా ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే కొనుగోళ్ల ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

# డ్యూటీలు వేయడం కాదు.. పిల్లలపై మానసిక ఒత్తిడి తగ్గించండి

- ఉపాధ్యాయులను కాపలా ఉంచడం సరికాదు
- తీవ్రంగా ఖండిస్తున్నాం : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ-భీంగల్

పిల్లలపై మానసిక ఒత్తిడి తగ్గించ కుండా ఉపాధ్యాయులకు నైట్ డ్యూటీ వేయడం సరికాదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్కా జనార్ధన్ పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలతో అప్రమత్తమైన సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి నైట్ డ్యూటీ ఉపాధ్యాయుల సంఖ్యను రెండు నుండి నాలుగుకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యాయులు వంతుల వారీగా రాత్రి కాపలా కాయాలని ఉత్తర్వుల్లో పేర్కొనటాన్ని టీఎస్‌యూటీఎఫ్ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నట్టు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురుకుల ఉపాధ్యాయులను రాత్రి కాపలాదారు స్థాయికి దిగజార్చడం తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలకు వారిపై పెరిగిన మానసిక వత్తిడి కారణమని ఆ అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా వింతైన ఉత్తర్వులు ఇవ్వటం సమంజసం కాదని పేర్కొన్నారు.

ఇంటర్, పదవ తరగతిలో ఉత్తమమైన ఫలితాల పేరిట విద్యార్థులను కార్పొరేట్ విద్యాసంస్థల తరహాలో వత్తిడికి గురిచేస్తూ మానసిక ప్రశాంతత లేకుండా చేస్తున్న కారణంగానే కార్పొరేట్ విద్యా సంస్థలకు పరిమితమైన ఆత్మహత్యలు గురుకుల విద్యాసంస్థ లో కూడా జరుగుతున్నాయని విమర్శించారు. వీటికి కారణాలను అధ్యయనం చేసి, నివారణ కోసం శాస్త్రీయమైన చర్యలు చేపట్టటానికి మానసిక నిపుణులతో కూడిన అధ్యయన కమిటీని నియమించాలని టిఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

అత్యధిక గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో నిర్వహిస్తూ విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించటంలో వైఫల్యం ఉందని, ఉ మెస్ చార్జీలు పెంచుతామని చెప్పి రెండేళ్ళు గడిచినా జిఓ ఇవ్వలేదని విమర్శించారు. ఎండలను తట్టుకోవడానికి విద్యార్థులకు పుచ్చకాయలు, చల్లని మజ్జిగ, చల్లని నీరు, అందుబాటులో ఉండాలని ఆదేశించారే కానీ అదనపు బడ్జెట్ ఇవ్వకుండా ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు.

ఉపాధ్యాయులపై ఇప్పటికే బోధనేతర పనుల భారం అధికంగా ఉందని, ఇప్పుడు రాత్రి డ్యూటీలో ఉండే ఉపాధ్యాయుల సంఖ్యను పెంచడం ద్వారా వారిపై ఒత్తిడి మరింత పెరుగుతుందని, కనుక ఉపాధ్యాయులను నైట్ వాచ్‌మన్‌లుగా మార్చకుండా విద్యార్థులపై మానసిక వత్తిడిని తగ్గించి ఆహ్లాదకర వాతావరణంలో చదువుకునే విధంగా ప్రోత్సహించాలని కోరారు.

# సమన్వయంతో పనిచేయాలి

- నోడల్ అధికారులతో కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ప్రశాంత వాతావరణంలో పార్లమెంటు ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్‌లు చంద్రమోహన్, శ్రీనివాస్‌రెడ్డి, అదనపు ఎస్పీ నరసింహారెడ్డిలతో కలిసి నోడల్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అభ్యర్థి చేసే ప్రతి ఖర్చు లెక్కలో చూపవలసి ఉంటుందని అన్నారు. ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలో ప్రధానంగా ముందస్తుగా అనుమతులు లేని వాహనాలు, సభలు, సమావేశాలు, లౌడ్ స్పీకర్‌లతో పాటు డబ్బు, మద్యం, బహుమతులు తరలించుటపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కోడ్ ఉలంఘన, అక్రమ డబ్బు, మద్యం తరలింపులపై కేసులు నమోదు చేసి రోజు వారి నివేదికలు సమర్పించాలని సూచించారు. సివిజిల్ యాప్ ద్వారా వస్తున్న ఫిర్యాదులపై తక్షణమే ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలకు సమాచారమందించాలని, కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని తెలిపారు. ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్స్‌ఆప్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలలో వస్తున్న అసత్య వార్తలకు తక్షణమే స్పందించి అట్టి వార్తలు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. చెల్లింపు వార్తలపై దృష్టిపెట్టాలని, కరపత్రాలు, ఫ్లెక్సీలు వంటివి ముంద్రించే విషయంలో ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 127-ఏ సూచనలు పాటించాలన్నారు. ఎన్నికల ప్రచార ప్రకటనలు, ప్రచార అంశాలు, ఎల్ఈడి, డిజే ప్లే తదితర వాటికి ఎంసిఎంసి ద్వారా అనుమతులు జారీ చేయాలని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ పడిన వెంటనే డివిజన్‌ల వారీగా ఈవిఏంలను క్లోస్డ్ కంటైనెర్‌లో తరలించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. బ్యాలెట్ యూనిట్ ద్వారా ఓటు వేసే విధానంపై పట్టణ ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, పోలీసు సిబ్బంది తదితరులకు అవసరమైన వాహనాలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన ప్రక్రియ సోమవారం నాటికి పూర్తిచేయాలన్నారు. ఎన్నికల విధులు కేటాయిచిన వారికి ఎలాంటి మినహాయింపు లేదని, హాజరు కానీ వారికి షో కాజ్ నోటీసులు జారీచేస్తామని, ఉద్యోగులు ఎవ్వరు రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు తదితర కార్యక్రమాలలో పాల్గొనరాదని హెచ్చరించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వికలాంగుల కోసం వీల్‌చైర్ సిద్ధంగా ఉంచాలన్నారు. ఎన్నికల నిర్వహణపై ప్రకటన వెలువడిన నాటి నుంచి నేటి వరకు 50 లక్షల నగదుతో పాటు 41 లక్షల విలువగల మద్యం స్వాదీనం చేసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సాధారణ పరిశీలకులుగా గోపాల్ జి.తివారి, పోలీసు పరిశీలకులుగా దీపక్ భార్గవ్‌ను ఎన్నికల కమీషన్ నియమించిందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు వరదారెడ్డి, శ్రీనివాస్, అంబాజీ, శ్రీనివాస్‌రెడ్డి, రాజారామ్, ఏఓ మసూర్ అహ్మద్, ఎన్నికల పర్యవేక్షకులు ప్రేమ్‌కుమార్, ఇందిరా ప్రియదర్శిని, జ్యోతి, స్వప్న, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ కిట్ల పంపిణీ


కిట్లు పంపిణీ చేసిన్న కిడ్స్‌పార్క్ స్కూల్

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని కిడ్స్‌పార్క్ స్కూల్‌లో రంజాన్ కిట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఈ రంజాన్ కిట్ల పంపిణీ ప్రతి సంవత్సరం చేస్తామని, ఈ సంవత్సరం కూడా అదే తరహాలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. రంజాన్ పండగను అందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అందరికీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నెలరోజులపాటు చేసి నెలవంక చూసిన మరుసటి రోజు ఈద్-ఉల్-ఫితర్ పండుగగా జరుపుతారని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అసిఫ్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
నిజామాబాద్
గురువారం ఏప్రిల్ 11, 2024 www.navatelangana.com

## కళ్యాపూర్‌లో నర్సరీ వాటర్ ట్యాంకులు పరిశీలన


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో నర్సరీ తో పాటు, గ్రామంలోని వాటర్ ట్యాంకులను ఎంపీడీవో శంకర్ బుధవారం పరిశీలించారు. వేసవిలో నర్సరీల పెంపకంలో జాగ్రత్తలను పాటించాలని కార్యదర్శి నవీన్‌కు సూచించారు. ప్రతిరోజు రెండుపూటలా మొక్కలకు నీటిని అందించి వారు ఆదేశించారు. అనంతరం గ్రామంలోని తాగునీటి ట్యాంకులను పరిశీలించి వారంకోసారి వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని వారు పేర్కొన్నారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి గౌస్ ఉద్దీన్, సూపరింటెంట్ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి జి.నవీన్ పాల్గొన్నారు.

## పనులను నాణ్యతగా చేయాలి : ఎంఈవో


మాట్లాడుతున్న ఎంఈఓ ఆంధ్రయ్య

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ ఆంధ్రయ్య అధ్యక్షతన అమ్మ ఆదర్శ పాఠశాలలో నిర్వహించే పనులపై ప్రధానోపాధ్యాయులు, విఓ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఆంధ్రయ్య, ఏఈ నాగేశ్వర్ రావ్ మాట్లాడుతూ... మండలంలోని 12 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరిగే పనులను నాణ్యతగా చేయాలని అన్నారు. పనులు పాఠశాలలకు ఉపయోగపడేలా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ శివ చరణ్,ఐకేపీ ఏపీఎం శ్యామ్,ఎంఎస్ఓ ఆనంద్ రావ్,పాఠశాల ఇంచార్జ్ హెచ్.ఎం.మునిరోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## రైతు కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు సాయిలు పంటపొలం మూడు రోజుల కింద వడగళ్ళ వానకు వరిధాన్యం నేలమట్టం అయింది. దీంతో తీవ్రంగా నష్టపోయిన రైతు కుటుంబాన్ని బుధవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డి మోహన్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వడ్డీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత రైతులను బీజేపీ పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బిజెపి బోధన్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, సాలూర మండల అధ్యక్షులు ప్రవీణ్, రెంజల్ వైస్ ఎంపీపీ క్యాతం యోగేష్ ,ప్రధాన కార్యదర్శి సాయినాథ్, బిజెపి నాయకులు బాబు, శ్రీధర్, ప్రకాష్, మారుతీ, దత్తత్రి, రమణ రావ్, పాండు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## 435 పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు


గాలికుంటు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

నవతెలంగాణ - మాక్లూర్

మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో పశు వైద్యశాల అధ్వర్యంలో పశువులకు ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను పశు వైద్యులు కిరణ్ దేశ్ పాండే బుధవారం వేశారు. ఈ సందర్భంగా 435 పశువులకు ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ప్రతి రైతు తమ పశు వులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని, ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డా. ఉమమ సహెర్, విఎల్ఓ వినిత, విఏ అహ్మద్ పాషా, గోపాల మిత్ర సుదీర్, వ్యాక్సినేటర్ జైల్ సింగ్, సిబ్బంది శ్రీను, గంగాధర్, పుష్ప, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

## కాంతి పాఠశాలలో కాన్వకేషన్ డే


కాన్వకేషన్‌డేలో పాల్గొన్న చిన్నారులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ కాంతి హైస్కూల్లో చిన్నారులకు కాన్వకేషన్ డే బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కాంతిగంగారెడ్డి మాట్లాడుతూ.. గతంలో డిగ్రీ పూర్తయినప్పుడు ఇటువంటి వేడుకలు నిర్వహించే వారని, అయితే చిన్నతనంలోనే ఒక లక్ష్యాన్ని సాధిస్తే ఉండే అనుభూతి ఎలా ఉంటుందో పిల్లలకు పరిచయం చేసేందుకు కాన్వకేషన్‌డేని చిన్నారులకు నిర్వహిస్తున్నామని తెలిపారు. గత సంవత్సరం కూడా ఘనంగా నిర్వహించామని అన్నారు. విద్యార్థి కౌమార దశలో తల్లిదండ్రుల పాత్ర చాలా ముఖ్యమని, పాఠశాలలో నేర్పిన పాఠాలను ఇంటి వద్ద కూడా తల్లిదండ్రులు రివిజన్ చేయించడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేయవచ్చని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లిదండ్రులకు కూడా వర్క్ షాప్స్ నిర్వహిస్తామని, అలాగే ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా నిర్వహించి పిల్లలను ప్రోత్సహిస్తామని తెలిపారు. కార్యక్రమాలు నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఇల వంక చూసే.. నెలవంక

- నేడు ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్)
- ఈద్గా వద్ద ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు


ప్రార్థనలకు సిద్ధం చేసిన దర్గా


ఇఫ్తార్‌విందులో పాల్గొన్న ముస్లింలు(ఫైల్)

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆధ్యాత్మిక, సోదరభావాన్ని పరిమళింపజేసే పవిత్ర మాసంగా ముస్లింలు రంజాన్ పండుగను భావిస్తారు. ఈమాసంలో ముస్లింలు నిష్ఠతోకూడిన ఉపవాస దీక్షలు పాటిస్తారు, ఉర్దూక్యాలండర్ ప్రకారం సంవత్సరంలోని 9వ మాసంలో రంజాన్ నెల వస్తుంది. మొత్తం 30రోజులపాటు ఉపవాస దీక్షలు చేపడతారు. ఈ దీక్షలను తెల్లవారు జామున సూర్యోదయానికి ముందు, సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత నియమ నిష్టలతో పూర్తిచేస్తారు. దీక్షా సమయంలో సత్య సంభాషణ, నైతిక ధర్మాచారాలతో దైవవిశ్వాసాన్ని పొందడానికి ప్రయత్నిస్తారు. ఉపవాసం చేసేవారు సాయంత్రం దీక్ష విరమించే వరకూ నీటిని కూడా తాగరు. కనీసం లాలాజలాన్ని కూడా గొంతుదాటి లోనికి వెళ్లకుండా దీక్ష చేస్తారు. "సూర్యోదయానికి ఫజర్ సమాజ్, మధ్యాహ్నం జోహర్ సమాజ్, సాయంత్రం నుండి 5వరకు అసర్ నమాజ్ చేస్తారు. సాయంత్రం 6 గంటలకు ప్రార్థనా మందిరాలకు చేరుకుని ఉపవాస దీక్షలను విడుస్తారు. తమవెంట తెచ్చుకున్న పండ్లతో దీక్షను విరమించి మగ్రీబ్ నమాజ్ చేస్తారు. అనంతరం భోజనాలు ముగించుకుని ఇషా నమాజ్ తర్వాత తరావీ నమాజ్ చేస్తారు.

**దైవభక్తిని పెంపొందించే తరావి సమాజ్..**

రంజాన్ మాసంలో ప్రత్యేకంగా చేసే తరావ సమాజ్ దైవభక్తిని పెంపొందిస్తుంది. ఈనెలలో 30 రోజుల పాటు చేసే ఐదుపూటల సమాజ్‌తో పాటు తరావి సమాజ్‌ను అదనంగా చేస్తారు. సుమారు గంటన్నర నుండి రెండున్నర గంటలపాటు ఏకధాటిగా ఈ నమాజ్ కొనసాగు తుంది. నమాజ్‌లో ఖురాన్ కు చెందిన 30 అధ్యాయా ల్లోని శ్లోకాలను ఒకటి నుండి రెండున్నర పేరాల వరకూ హపిక్-ఎ - ఖురాన్ (ఖురాన్ చూడకుండా చదివే వ్యక్తి) ప్రతిరోజూ కొన్నింటిని చదువుతారు. ఇక ఇషా సమాజ్ తర్వాత ఇది పాటిస్తారు. రంజాన్ ప్రారంభానికి ఒక రోజు ముందు మొదలయ్యే ఈ తరావీ నమాజ్ 30 రోజుల దీక్షల అనంతరం ఈదుల్- ఫితర్- పండగ పర్వదినానికి ఒక రోజు ముందుతో తరావి నమాజ్ ముగుస్తుంది. పండగరోజు ఊరి చివరన ఉండే ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్ధనలు చేసి ఒకరికొకరు ఈదుల్ - ఫితర్ శుభాకాంక్షలు, ఈద్ ముబారక్ చెప్పుకుంటూ ఆలింగనం చేసుకుంటారు.

**పేదల హక్కు జకాత్..**

ఇస్లాం నిర్దేశించిన అరు సూత్రాల్లో జకత్ ఒకటి. తమవద్ద ఉన్న ఆస్తి పాస్తుల్లో కొంతైనా నిరు పేదలకు పంచివ్వాలన్నదే జకాత్ సారాంశం..

**ఫిత్ర..**

రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు తన ఆర్ధిక స్తోమతతో సంబంధం లేకుండా తన సంపాదనలో కొంత మేరకు దానం చేయాల్సి ఉంటుంది. దినినే ఫిత్రగా పిలుస్తారు. కుటుంబలో ఉన్న సభ్యుల లెక్కన నాణ్యమైన గోధుమలు, జొన్నలకు మార్కెట్‌లో కిలో విలువ లెక్క కట్టి అ లెక్క ప్రకారం ఒక మనిషికి ఒక కిలో విలువ కట్టి అ డబ్బులను నిరుపేదలకు, పేదలకు, తమ కుటుంబంలో ఉన్న పేదలకు ముందుగా పంచి పెట్టడమే ఫిత్ర ఉద్దేశం.

**ఎతెకాఫ్ వ్రతం**

రంజాన్ మాసంలో 21వ రోజు నుండి పండగ ముందు రోజు వరకు ఉనవాస దీక్షాపరులు "ఎతెకాఫ్" వ్రతాన్ని కొందరు పాటిస్తారు. ఈ సందర్భంగా వారు భవ్య ప్రపంచాన్ని పూర్తిగా మైమరిచి మసీదుల్లో దైవ ప్రార్థనల్లో నిమగ్నమవుతారు. నెలవంక కనిపిస్తేనే వారు ఎతెకాఫ్ వ్రతాన్ని విరమిస్తారు. పండగ రోజు నమాజ్ అనంతరం తమ తమ ఇండ్లకు చేరుకుని సీర్ కుర్మా సేవిస్తారు. ప్రధాన పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో ఉపవాస దీక్షల అనంతరం హలీం, హారిస్, ద్రైవడ, కద్దుకి ఖీర్, డబుల్ కామీట, ఖుర్బానీక మీటతో పాటు తదితర వంటకాలను భుజిస్తారు.

**దురలవాట్లకు దూరంగా..**

సిగిరెట్, బీడీ, మద్యపానం, గుట్కా, పాన్‌తోపాటు ఇతరత్రా చెడు అలవాట్లకు చాలా వరకు రంజాన్ మాసంలో దూరంగా ఉంటారు. ఈ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలంతా విధిగా రోజా (ఉపవాస దీక్ష)పాటించి అల్లాహ్ నిర్దేశించిన అన్ని రకాల నమాజ్ లను ప్రతి ఒక్కరూ చిన్న పెద్ద తేడా లేకుండా అచరించాలని ఖురాన్ ముస్లింలకు అదేశిస్తుంది. ఉపవాస దీక్ష పాటించిన, పాటించకపోయిన రంజాన్ మాసంలో రోజు చేసే నమాజ్, తరావి నమాజ్‌కు భక్తి శ్రద్ధలతో వెళ్తుంటారు.

**పండ్లకు ప్రాధాన్యం :-**

రంజాన్ ఉపవాస దీక్షలో ఉన్నవారు తెల్లవారుజాము నుండి సూర్యాస్తమయం వరకు ఎలాంటి అహారంగాని మంచి నీళ్లుగాని తీసుకోరు. అయితే దీక్ష విరమణకు పండ్లను ఆరగిస్తారు. ముఖ్యంగా ఖర్జూర పండ్లకు మతపరంగా ప్రత్యేక ప్రాధాన్యముంది. మహ్మద్ ప్రవక్త ఉపవాస దీక్షను ఖర్జూర పళ్లతిని విరమించారని ప్రతీతి. అందువల్ల ముస్లింలు రోజా విరమణ సమయంలో ఖర్జూర పళ్లను తినడం పవిత్ర కార్యంగా భావిస్తారు. దీక్ష విరమణ సమయంలో జామ, సేపులు, ద్రాక్ష, పుచ్చకాయలు, అనార్, బొప్పాయి, సంత్రా, మోసంబి, అరటిపండ్లు, దోసకాయలు తీసుకుంటారు. అనంతరం ఈ మాసంలో ప్రత్యేకంగా వెలిసిన హెూటల్‌లో హలీం, హరీస్, ద్రైవవ, డబుల్‌కా మీటా ఇతర తిను బండారాల కోసం ప్రత్యేకంగా వెళుంటారు.

**షబ్-ఎ-ఖదర్..**

రంజాన్ మాసంలో 26వ రోజున షబ్-ఎ - ఖదర్ జరుపుకుంటారు. అ రోజున 30 షారాల ఖురాన్‌ను పఠిస్తారు. ఖురాన్ పఠనం ఈ రోజుతో ముగుస్తుంది. ఇదే రోజు రాత్రి మసీదుల్లో పురుషులు, నివాస గృహల్లో జగ్నేకి రాత్‌ను నూతన వస్త్రాలు ధరించి ప్రత్యేక నియమ నిష్టతో (జాగరణ) పాటిస్తూనే ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం నెల రోజుల పాటు ఖురాన్ వినిపించిన హఫీజ్-ఏ- ఖురాన్ (మౌల్వి సాబ్)లను మస్జిద్ కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానిస్తారు.

**30 రోజులు.. 3భాగాలు**

రంజాన్ నెలను మూడు భాగాలుగా భావిస్తారు. ఇందులో తొలి 1రోజు ఉ పవాస దీక్ష నుండి 10వరకు రహమత్‌గా కొలుస్తారు. 11వ రోజు ఉపవాస దీక్ష నుండి 20వ రోజు వరకు మాగ్ఫిరత్ (క్రమకోదడం), మూడోది.. 21నుండి30వ రోజు పది రోజులు ఉపవాస దీక్షను జాహ్నంసె నిజ్జత్ చివరి పది రోజుల్లో వచ్చే బేసిక్ సంఖ్యలైన 21, 23,25, 27,29 వ రోజు తక్‌రాత్ గా పిలుస్తారు. ఈ రాత్రుల్లో జాగరణ చేస్తే దీనిలో ఏదో ఒక్క రోజు షబ్ -ఎ- ఖాదర్‌ను తమ వైపు చేసుకోవడానికి రాత్రుల్లో జాగరణ చేస్తారు. షబ్ -ఎ- ఖాదర్‌లోనే ఖురాన్‌ను అల్లాహ్ భూమి మీదకు పంపినట్లు ముస్లింలు విశ్వసిస్తారు. షబ్ -ఎ- ఖాదర్‌లో రాత్రి జాగరణ చేస్తే వెయ్యి నేలలకు సమానంగా కొలుస్తారు. ఆ రాత్రిని జాగరణ చేస్తే పాపాలను తొలగించి తమ కోర్కెలు తీరుస్తారని విశ్వాసం.

**సోదరభావాన్ని పెంపొందించే ఇఫ్తార్..**

రంజాన్ ఉపవాస దీక్షల్లో భాగంగా ప్రతిరోజు సాయంత్రం 5 నుండి రాత్రి 30లోపు దీక్షలు విరమించే సమయాన్ని ఇస్తార్ ఇంటారు చిన్నాపెద్ద, ధనిక పేద తేడా లేకుండా ఒకేచోటు గుమిగూడి కూర్చుని సామూహిక ఇఫ్తార్ చేస్తారు.. ఈ సమయాల్లో మసీదుల్లో కొత్త కాంతులు సంతరించుకుంటాయి. ముస్లింలతోపాలు హిందువులు, క్రైస్తవులు, ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందులు ఇస్తూ వారు కూడ ఇఫ్తార్ విందులో పాల్గొని మత సామరస్యాన్ని చాటుతారు. నెలరోజులపాటు ఇఫ్తార్ విందులు అనునిత్యం కొన సాగు తుంటాయి.

**గల్ఫ్‌లో బుధవారం మన దేశంలో నేడే..**

గల్ఫ్‌లో మంగళవారం నెలవంక దర్శనమివ్వడంతో బుధవారం ఈదుల్-ఫితర్ పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. మన దేశంలో బుధవారం నెలవంక కనపడటంతో గురువారం పండుగను నిర్వహించుకుంటున్నారు. గల్ఫ్‌లో మన దేశంలో ఒకరోజు ముందుగానే రోజా ఉపవాస దీక్షలు మొదలు కావడంతో మన దేశంలో ఒక రోజు ఆలస్యంగా రంజాన్‌ను దీక్షలను పాటించారు.

**ఈద్గా, మసీదులు సిద్ధం..**

రంజాన్ పండుగ కోసం మస్‌జీద్ కమిటీల ఆధ్వర్యంలో ఈద్గా లను సర్వం సిద్ధం చేశారు. రంజాన్ నెల మొదలైనప్పటి నుంచే ఆయా కమిటీల ఆధ్వర్యంలో మస్‌జిద్, ఈద్గాలను శుభ్రం చేసి రంగులు, ఇతర కార్యక్రమాలు చేపట్టారు. ఈదుల్- ఫితర్‌ను పురస్కరించుకుని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.

# మార్కెట్లో రంజాన్ సందడి


వస్త్రాలు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తున్న ముస్లింలు


సామాగ్రిని కొనుగోలు చేస్తున్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రంజాన్ పండుగ సందర్భంగా నగరంలోని నెహ్రూపార్క్ చౌరస్తా, పాత బస్టాండ్, గాంధీ చౌక్, అహ్మదీబజార్, తదితర ప్రాంతాల్లో రంజాన్ సందడి నెలకొంది. గురువారం ఉదయం ఆరు గంటల నుంచి 10 గంటల వరకు ముస్లిం సోదరులు రంజాన్‌కు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేశారు. ఈదుల్ ఫితర్ పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ సమీపంలో ఉన్న కచియా మసీద్‌లో ఉదయం 8 గంటల నుండి, ఖిల్లా ప్రాంగణంలోని జామా మసీదులో ఉదయం 8:30 నిమిషాల నుండి సామూహిక ప్రార్థనలు నిర్వహించ నున్నారు ఈద్గాలలో, మసీదులలో ముస్లిం సోదరుల సామూహిక ప్రార్థనల అనంతరం మత పెద్దలు సందేశాలు ఇవ్వనున్నారు.

## భీంగల్ మాజీ మున్సిపల్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీలో చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరిన్న మాజీ మున్సిపల్ చైర్మన్

నవతెలగాణ-భీంగల్

భీంగల్ మండలకేంద్రానికి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లెల రాజశ్రీ- లక్ష్మణ్ నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ప్రజా పాలనకు ఆకర్షితులై పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని చేరిన వారు తెలిపారు. ఈ సందర్భంగా ముత్యాల సునీల్ కుమార్ మాట్లాడుతూ,, నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు పనిచేసే జీవన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోధిరే స్వామి, జెజె నర్సయ్య, పల్లే శేఖర్, కోరాడి లింబాద్రి, రంజిత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# ఘనంగా ఉర్సుఉత్సవాలు

- కుర్నాపల్లి అబ్బయ్య దర్గా వద్ద


ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న పెద్దలు

నవతెలంగాణ-ఎడపల్లి

కుర్నాపల్లి గ్రామ శివారులోగల అబ్బయ్య దర్గాలో హజ్రత్ సయ్యద్ హబీబ్ షాహ్ 346వ జయంతిని పురస్కరించుకొని ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దర్గా ముత్తవల్లీలు అబ్దుల్ రజాక్, మహమ్మద్ యునుస్, మహమ్మద్ హైమద్ హాజి, ఎమ్.డి.ఎజాస్ ఆధ్వర్యంలో ఉదయం 4గంటల నుండే దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దర్గా ఆవరణలో జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా స్థానిక నాయకులు మైనార్టీ నాయకులు మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం పవిత్ర రంజాన్ మాసంలో ఇక్కడ ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 400 సంవత్సరాల క్రితమే ఇక్కడ దర్గా ఏర్పడిందని, దర్గా ఆవరణలో గల బావి నీళ్లతో స్నానం ఆచరిస్తే రోగాలు తొలిగిపోతాయని భక్తుల ప్రగాఢ నమ్మకమని ఆయన అన్నారు. ప్రతి శుక్ర, ఆదివారాల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారన్నారు. సాయంత్రం సందల్ (గంధం)షరీఫ్‌ను గుర్రంపై గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగిస్తూ దర్గా వద్దకు తీసుకువెళ్లారు. అనంతరం వచ్చిన భక్తులకు ఇఫ్తార్ విందుతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దర్గా వద్ద కవ్వాలి కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎండి ఎజాస్ ఎడపల్లి మండల్ మైనార్టీ జనరల్ సెక్రెటరీ, షేక్ అహ్మద్, షేక్ జామిల్, షేక్ షజిత్, ముత్తవలీ మొహమ్మద్ యునుస్ మొహమ్మద్ అబ్దుల్ రఫీ, షేక్ హైమధ్, షేక్ జమిల్ హైమద్, అబ్దుల్ లతీఫ్, షేక్ హైమద్ మాజీ సర్పంచ్ రవీందర్ గౌడ్ పరిగె సాయిలు, హనుమంత్ రెడ్డి, మహేష్ గౌడ్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంజయ్, ముస్లిం మైనారిటీ సోదరులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## సత్తాచాటిన శ్రీ చైతన్య విద్యార్థులు


బహుమతులు సాధించిన విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

జాతీయ స్థాయిలో జరిగిన ఒలింపియాడ్ ఎగ్జామ్ (ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్) ఎగ్జామ్ పట్టణ కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ పరీక్షలో జాతీయస్థాయిలో మొదటి బహుమతి (లెనివో టాబ్)ని 7వ తరగతి చదువుతున్న వై. సమీక్ష, మూడవ బహుమతి (స్మార్ట్ వాచ్)ని 5వ తరగతి చదువుతున్న ఎం. మాన్య రెడ్డి, నాల్గవ బహుమతి ( హాండ్ బ్యాగ్)ని, 6వ తరగతి చదువుతున్న జి.భవ్య, ఐదవ బహుమతి(హాట్ బాక్స్)ని 9వ తరగతి చదువుతున్న పి. హర్షిత్‌రెడ్డి గెలుపొందారని అన్నారు. వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు అనేక బహుమతులను గెలుపొందారని ప్రిన్సిపాల్ ముత్తు నందిపాటి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్మూర్ శ్రీ చైతన్య పాఠశాల నుండి 278మంది విద్యార్థులు ఈ జాతీయ స్థాయి ఒలింపియాడ్ ఎగ్జామ్‌లో సత్తా చాటారని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ముత్తు, ప్రిమరీ కో ఆర్డినేటర్ ప్రసన్న,ప్రీ ప్రైమరీ కో ఆర్డినేటర్ శ్రీ విద్య, డీన్ సంతోష్, సి ఇంఛార్జి రాకేష్, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం ఏప్రిల్ 11, 2024 www.navatelangana.com

## వేడుకలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న ముదిరాజ్ నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్న పెద్దమ్మ పెద్ది రాజుల కళ్యాణం, ఆలయ వార్షికోత్సవం ఉత్సవాలకు ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డికి ముదిరాజ్ నాయకులు ఆహ్వానం పలికారు. బుధవారం ఆయనను కలిసి ఆహ్వానపత్రికను ముదిరాజ్ పెద్దమ్మ ఆలయం కమిటీ అధ్యక్షులు పున్న లక్ష్మన్ ఆలయం కమిటీ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ పెద్దమ్మ ఆలయం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తనన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ పెద్దమ్మ ఆలయం కమిటీ సభ్యులు బాలయ్య, కార్యదర్శి బోయిని సత్యం, నర్సింలు, నాయకులు ఉన్నారు.

## నగదు పట్టివేత


నగదు పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండలంలోని బ్రాహ్మణపల్లి అంతరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద బుధవారం వాహనాల తనిఖీలు చేపట్టగా.. రూ.5,45,000 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సమీర్ హుస్సేన్ సాబ్ కురేశి అను వ్యక్తి బొలెరో వాహనంలో హైదరాబాద్ నుండి నాందేడ్ వైపు నగదు తీసుకెళ్తుండగా నగదు దొరికిందని ఆయన తెలిపారు. ఎలాంటి పత్రాలు చూపెట్టకపోవడం వలన అట్టి నగదుని సీజ్ చేసామని ఆయన తెలిపారు. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉంది కావున పెద్ద మొత్తంలో నగదును ఎవరు కూడా తీసుకెళ్లద్దని ఒకవేళ తీసుకెళ్తే అందుకు తగిన పత్రాలు చూపెట్టాలని ఆయన తెలిపారు.

## 'అడ్డు అదుపు' లేకపోవడంతో

# ఆదాయంలో కోత

- చెక్‌పోస్టును తప్పించుకునేందుకు అడ్డదారిలో వెళ్తున్న లారీలు
- పలుమార్లు దృష్టికి తీసుకెళ్లినా పట్టని అధికారులు

నవతెలంగాణ-మద్నూర్

రాష్ట్రానికి పూర్తిగా సరిహద్దులోని మహారాష్ట్రకు పూర్తిగా బార్డర్‌లోని మద్నూర్ మండల కేంద్రం మీదుగా పెద్ద తడగూర్ అడ్డు దారి గుండా మహారాష్ట్రకు రాత్రింబవళ్లు వందల సంఖ్యలో సరుకు వాహనాలు అక్రమ రవాణా కొనసాగిస్తున్నాయి. ఈ అడ్డు దారి గుండా అక్రమ రవాణా జరిపే సరుకు లారీల ద్వారా రాష్ట్ర ఆదాయానికి రోజువారి లెక్కల్లో లక్షలాది రూపాయలు ఆదాయం కోల్పోవలసి వస్తుందని మండల ప్రజల్లో ఆవేదన వ్యక్తం అవుతుంది. అక్రమ రవాణాకు ఈ అడ్డు దారి వాహనదారులకు అడ్డు అదుపు లేకుండా పోవడంతో రాత్రి పగలు తేడా లేకుండా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల సమయం జాతీయ రహదారిపైనే వాహనాల తనిఖీల చెకింగ్ చెక్పోస్టు కొనసాగిస్తున్నారు. అక్రమ అడ్డదారికి ఎలాంటి చెకింగ్‌లు లేకపోవడంతో అక్రమ రవాణా దారులు ఈ అడ్డదారి గుండా వాహనాలను తరలిస్తున్నారు. ఒకటైతే సరుకులకు పన్ను చెల్లించలేకపోవడం రెండవది అధిక లోడుతో రవాణా శాఖకు రావలసిన ఆదాయం రాకపోవడం ఎన్నికల సమయం అయినందున మద్యం గానీ డబ్బులు గానీ అడ్డుదారుల గుండా తరలించే ఆస్కారం జోరుగా కొనసాగుతున్నట్లు మండల ప్రజల్లో ఆవేదన వ్యక్తమవుతున్నాయి. మన రాష్ట్ర సరిహద్దు మహారాష్ట్ర ప్రాంతంలో వాహనాలకు వేబిడ్జ్ తూకాల ద్వారా ఓవర్ లోడ్ సరుకుల పైన పన్ను విధిస్తున్నారు. అలాంటి అంతరాష్ట్ర చెక్పోస్టు తప్పించే మార్గంలో అడ్డుదారు గుండా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. మహారాష్ట్ర నుండి తెలంగాణలోకి ఇటు నుండి మహారాష్ట్రలోకి అక్రమ రవాణాకు మండల కేంద్రం మీదుగా పెద్ద తడగూర్ రోడ్డు అడ్రస్‌గా మారింది. ఈ అడ్డదారికి అక్కడి మహారాష్ట్ర ప్రభుత్వము గానీ ఇక్కడి తెలంగాణ ప్రభుత్వంగానీ అడ్డుకట్ట వేయలేకపోవడంతో ఇరు రాష్ట్రాలకు లక్షల్లో ఆదాయం కోల్పోవలసి వస్తుందని ఇంత పెద్ద రవాణా అక్రమంగా జరుగుతుంటే అధికారులు ఏమాత్రం అడ్డుకట్ట వేయలేకపోతు న్నారని ప్రజల్లో ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఈ అడ్డు దారి ఎన్నికల సమయానికి కాకుండా శాశ్వతంగా అడ్డుకట్ట వేస్తేనే రాష్ట్ర ఆదాయానికి గండి పడకుండా ఉంటుందని ప్రజల్లో ఆవేదన వ్యక్తం అవుతుంది. అడ్డుదారి గుండా లక్షల్లో ఆదాయం




చెక్‌పోస్ట్ వద్ద లారీలు వెళ్తున్న దృశ్యం

కోల్పోతుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై మండల ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి ఎక్కడో ఏదో జరుగుతుందని అనుమానాలు ప్రజల్లో చర్చలు వినబడుతున్నాయి. ఇంత పెద్ద అక్రమ రవాణా రాష్ట్ర ఆదాయానికి గండి పడుతుంటే పట్టించుకోరేమి అనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ అడ్డు దారి అక్రమ రవాణాకు అడ్రస్‌గా మారడం జాతీయ రహదారి గుండా కాకుండా అధిక వాహనాలు అక్రమ రవాణా గుండానే వెళు న్నాయి. అక్రమ రవాణా గురించి పలుమార్లు పత్రికల్లో వార్తలు వెలువరిస్తున్నప్పటికీ ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం రాష్ట్ర ఆదాయం పూర్తిగా కోల్పోవలసి వస్తుందని ప్రజల్లో ఆవేదన వ్యక్తం అవుతుంది.

## పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు

- ఎమ్మెల్యే కల్వకుంట్ల మదన్ మోహన్ రావు



నవతెలంగాణ-రామారెడ్డి

పార్టీ కోసం కష్టపడిన వారికే భవిష్యత్తులో పదవులు దక్కుతాయని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిపి లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటికి ప్రచారం చేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నా రు. మండల కేంద్రంలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్ లో మండల స్థాయి ఎల్లారెడ్డి నియోజకవర్గ గ్రామా కార్యకర్త విస్తృతస్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మదన్ మోహన్ రావు మాట్లాడుతూ... పది సంవత్సరాలు ఎంపీగా బిబి పాటిల్ రామారెడ్డికి చేసింది శూన్యమని, రామారెడ్డి మండల గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని తెలిపారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, పార్లమెంట్ ఎన్నికల్లో ఇంటింటికి తీసుకెళ్లి, రామారెడ్డి మండలంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు అధిక మెజార్టీ వచ్చేలా ప్రజల్లో అవగాహన తీసుకురావా లని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు లక్ష్మా గౌడ్, గిద్ద ఎంపిటిసి ప్రవీణ్ గౌడ్, తూర్పు రాజు, కందూరి లింబాద్రి, లక్కాకుల శేఖర్, తూర్పు సుబ్బన్న, నామాల రవి, బి పేట నర్సింలు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సదాశివనగర్ :** మండలంలోని పద్మాజివాడి గ్రామంలో గల రెడ్డి ఫంక్షన్ హాల్ నందు ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో సదాశివనగర్ మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో సదాశివనగర్ మండలంలో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజారిటీ వచ్చేటట్టు కషి చేయాలని సూచించారు. 10 సంవత్సరాలుగా ఎంపీ బీబీ పాటిల్ సదాశివనగర్ ప్రజలకు చేసింది శూన్యమని, బీబీ పాటిల్ అధ్వర్యంలో సదాశివనగర్ మండల గ్రామాలలో ఎటువంటి అబివద్ధి జరగలేదని ఈ విషయాన్ని గ్రామ ప్రజలలోకి బలంగా తీసుకుని వెళ్ళాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, గ్రామ కాంగ్రెస్ కమిటి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ నాయకులకు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కార్యకర్తలతో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రెడ్డి

## సహ చట్టం పూర్తిస్థాయిలో అమలు చేయాలి


కరపత్రాలను విడుదల చేస్తున్న పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ప్రజలు కోరిన సమాచారాన్ని సంబంధిత అధికారులు 30 రోజులలో ఇవ్వాలని సమాచార హక్కు చట్టం కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం అన్నారు. కామారెడ్డి పట్టణంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో గాంధీ మహాత్ముని విగ్రహం ముందు సమాచార హక్కు చట్టం-2005 అవగాహన కరపత్రాన్ని ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాచారాన్ని గడువులోగా సంబంధిత అధికారులు ఇవ్వకపోయినాచో ఆపిల్ కెళ్ళి సమాచారాన్ని పొందే హక్కు ఉంటుందన్నారు. ప్రతి పౌరునికి సమాచార హక్కు చట్టం పైన అవగాహన కలిగి ఉండేందుకు ఈ కరపత్రం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ ఎం. ఏ.సలీం, జోన్ అధ్యక్షులు సిర్నాపల్లి ప్రదీప్ కుమార్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు శివపూజ లింగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ అలీముద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంవి భాస్కర్, జిల్లా సలహాదారులు అబ్దుల్ లతీఫ్, జిల్లా ప్రతినిధులు బట్టు శ్రీనివాస్, అన్వర్ గౌరీ, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రికార్డులు ఎప్పటికప్పుడు నిర్వహించాలి


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-పిట్లం

గ్రామపంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు నిర్వహించాలని ఎంపీడీవో కమలాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని చిల్లర్గి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ఆయా వార్డులలో చెత్తాచెదారం, మురుగునీటి కాలువలను ఎప్పటి కప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సెక్రటరీకి ఆదేశించారు. ఎండలు దంచి కొడుతున్నందున తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇంటి, కిరాణా, తదితర షాపుల పన్నులను పూర్తిచేయాలని అన్నారు. అనంతరం హెల్త్ సెంటర్‌ను పరిశీలించి గర్భిణి, బాలింతలకు సకాలంలో ఇమినైజేషన్ పూర్తిచేయాలని, ఆరోగ్య సలహాలు, సూచనలు అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ బ్రహ్మం, సెక్రెటరీ విజయ, హెల్త్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పట్టుబడ్డ ఇసుక వేలం

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాం సాగర్ మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో ఇసుకను వేలంపాట ద్వారా విక్రయిస్తున్నామని ఎమ్మార్వో బిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 10 రోజుల క్రితం ఇసుకను అక్రమంగా తరలిస్తున్నటు వంటి మూడు ట్రాక్టర్లను ఎస్సై సుధాకర్ పట్టుకున్నాడని అట్టి ఇసుకను సోమవారం రోజు ఉదయం 11.30 కు నిజాంసాగర్ పోలీస్ స్టేషన్‌లో వేలంపాట ద్వారా ఇసుకను విక్రయిస్తున్నామని ఆయన తెలిపారు. ఇసుక ధర ఒక్క క్యూబిక్ మీటర్ వచ్చి 662 గా ప్రభుత్వం నిర్ణయించిందని ట్రాక్టర్లో మొత్తం 2.50 క్యూబిక్ మీటర్‌ల ఇసుక ఉందని ఆయన తెలిపారు. ఆసక్తి గలవారు వచ్చి ఇసుకను వేలంపాట ద్వారా దక్కించుకోవాలని ఆయన సూచించారు.

## కాంగ్రెస్ హామీలు అమలు కావాలంటే

# బీఆర్ఎస్‌కు ఓటెయ్యండి

- మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-దోమకొండ

కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కావాలంటే బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని శాసనసభ మాజీ స్పీకర్ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రశ్నించే నాయకులను పార్లమెంట్‌కు పంపాలని చెప్పారు. బుధవారం దోమకొండ, బీబీపేట్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం దోమకొండ మండల కేంద్రంలోని శ్రీ పెద్దమ్మ ఆలయం కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ మట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఎన్నో వాగ్దానాలు చేసిందని ఆ వాగ్దానాలను ప్రస్తుతం అమలు కావాలంటే ప్రశ్నించే గొంతుకలు కావాలని, అలాంటి గొంతుక, ఎప్పుడూ ప్రజల కోసం పాటుపడే బిఆర్ఎస్ పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీతో కొట్లాడైనా వారు ఇచ్చిన వాగ్దానాలు ప్రజలకు అమలయ్యే విధంగా బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు.

కామారెడ్డి నియోజకవర్గంలోని దోమకొండ, బీబీపేట్ మండల బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశనికి మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, బీఆర్ఎస్ పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు యంకె ముజీబోద్దీన్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ లు కార్యక్రమానికి హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ సీఎం కెసిఆర్ గారు బలపర్చిన బీఆర్ఎస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ ను కారు గుర్తు పై ఓటు వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్ కుమార్, ఎంపీపీలు పిప్పిరి ఆంజనేయులు, ఏం. బాలమణి, కన్నంటి శారదా నాగరాజు, దోమకొండ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గండ్ర మధుసూదన్ రావు, మాజీ సొసైటి చైర్మన్ నర్సారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కామారెడ్డి నియోజకవర్గ అధికార ప్రతినిధి గైని శ్రీనివాస్ గౌడ్, గెరిగంటి లక్ష్మినారాయణ, మాసుల లక్ష్మీనారాయణ, సొసైటి చైర్మన్లు, డైరెక్టర్లు, ఎంపీటీసీ లు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ దోమకొండ, బీబీపేట్ మండలాల నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్

## అబద్ధాలతో గద్దెనెక్కారు..

**సదాశివనగర్ :** అబద్దాల హామీలతో గద్దెనెక్కారని, కాంగ్రెస్ బిజెపి దొంగ హామీలను నమ్మి మోసపోవద్దని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మర్క ల్ స్టేజి వద్ద గల కళ్యాణ మండపంలో సదాశివనగర్, రామారెడ్డి ఉమ్మడి మండలాల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రావాలని సాధ్యం కానీ మోసపూరిత హామీలను ఇచ్చి గద్దనెక్కారని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఏం చేసిందని ప్రశ్నించారు. నల్లధనాన్ని ప్రజలకు పంపిణీ చేస్తామని, రైతుల ఆదాయాన్ని డబుల్ చేస్తామన్న హామీ ఏమైందన్నారు. పార్లమెంటు ఎన్నికలలో గాలి అనిల్ కుమార్ కు ఓట్లు వేసి కాంగ్రెస్ బిజెపిలకు దిమ్మతిరిగేలా చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో మళ్లీ బిఆర్ ఎస్ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు.

అంతకుముందు మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ దొంగలందరూ బీఆర్ఎస్‌ను విడిచి ఇతర పార్టీలలో చేరారని అసలు సిసలైన ఉద్యమకారులు బీఆర్ఎస్‌లో ఉన్నారని అన్నారు. గత 25 సంవత్సరాలుగా ప్రజాసేవ కోసమే పని చేస్తున్నానని, ఎమ్మెల్యేగా ఉండి కూడా స్థానికంగానే ఉన్నానని, గెలిచిన ఓడిన ప్రజలతోనే ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గైని అనసూయ, నా రెడ్డి దశరథ్ రెడ్డి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొలిపల్లి మహేందర్ రెడ్డి, ఎఎంసి చైర్మన్ పులగం సాయి రెడ్డి సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు ఎండి అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ అగ్ని ప్రమాదం

- ఐదు నివాస గుడిసెలు దగ్ధం
- 25 లక్షల పైగా ఆస్తి నష్టం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని కొండాపూర్ తండాలో బుధవారం మధ్యాహ్నం భారీ అగ్ని వమాదం సంభవించింది. అగ్ని ప్రమాదంలో ఐదు నివాస గుడిసెలు దగ్ధమయ్యాయి 25 లక్షల పైగా ఆస్తి నష్టంగా తిన్నట్లు తండావాసులు తెలిపారు.

మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో మంజ బావల సింగ్ ఇంటిపై ఉన్న విద్యుత్‌వైర్‌లు గాలిదుమారంతో గుడిసెకు తగిలి మంటలు చెలరేగాయి. దీంతో గుడిసె పూర్తిగా దగ్ధమైంది. తండా సమీపంలో వ్యవసాయ పనుల్లో ఉన్న గిరిజనులు మంటలు అర్పడానికి ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. మంటలు ఎగిసి పడటంతో మంజ ప్రకాష్, మంజ పర్తాల్ నివాస గుడిసెకు మంటలు వ్యాపించాయి, పక్కనే ఉన్న మంజా నారాయణ, మంజు సర్దార్ అగ్ని ప్రమాదం జరిగే సమయంలో ఈదురు గాలులు రావడంతో సమీపంలోని గుడిసెల అగ్ని మంటలు వ్యాపించాయి. దీంతో గిరిజనులు చల్లచెదురయ్యారు. ఒకవైపు ఎండలు మరోవైపు మంటలు ఎగిసిపడడంతో మరోవైపు ఈదురుగాలు రావడంతో గిరిజనుల రోజుల్లో నిన్నటి పోయాయి. వెంటనే ఎల్లారెడ్డి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సమాచారం మేరకు అగ్నిమాపక దళం అక్కడికి చేరుకొని చుట్టుపక్కల మంటలు వ్యాపించకుండా నీటితో చల్లారించారు.

అగ్ని ప్రమాదంలో గిరిజనులు సర్వం కోల్పోయారు. కట్టుబట్టలే మిగిలాయని వారు రోదస్తూ తెలిపారు. అగ్ని ప్రమాదంలో మంజ ప్రకాష్ చెందిన నివాసపు గుడిసెలో 60 తులాల వెండి 35 వేల రూపాయల నగదు తులం బంగారం వంట సామాగ్రి వ్యవసాయ పనిముట్లు నిత్యవసర సరుకులు టీవీ బీరువా విలువైన బట్టలు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంజ పరతల్ నివాస గుడిసెలో 50 తులాల వెండి పదివేల నగదు మక్కలు వడ్ల సంచులు వంట సామాగ్రి నిత్యసర సరుకులు కాలి బూడిద అయ్యాయి. మంజు నారాయణ నివాస గుడిసెలో 20 వేల నగదు 50 తులాల వెండి అర తులం బంగారం వంట సామాగ్రి వ్యవసాయ పనిముట్లు నిత్యవసర సరుకులు బట్టలు పూర్తిగా కాలిపోయాయి. మంజ బావల్ సింగ్ చందన నివాసం గుడిసెలో వడ్లు మక్కలు వ్యవసాయ పనిముట్లు వారి ధాన్యం కోసం నిలువ ఉంచిన బార్దన్ పూర్తిగా కాలిపోయినట్టు బాధితులు తెలిపారు. ఘటనా స్థలానికి లింగంపేట్ డిప్యూటీ తాసిల్దార్ చంద్ర రాజేశ్వర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ బాలయ్య అక్కడికి చేరుకొని అగ్ని ప్రమాదం గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచనామా నిర్వహించి జిల్లా ఉన్నత అధికారులకు పంచనామా నివేదికను అందిస్తామన్నారు. అగ్నిప్రమాదము సర్వం కోల్పోయిన బాధితులు వారి జీవితాలు రోడ్లపై పడ్డాయి కట్టుబట్టలే మిగిలాయి దాతలు ఎవరైనా ముందుకొచ్చి వారిని ఆదుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.


మంటలు చెలరేగుతున్న దృశ్యం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

## పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ ప్రోగ్రాం బుధవారం రోజున నిర్వహించినట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల విద్యార్థులు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పాఠశాలకి చెందిన విద్యార్థినిలు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి లా అండ్ ఆర్డర్, వివరాలను పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఫింగర్ ప్రింట్, కమ్యూనికేషన్ వ్యవస్థ ఏ విధంగా పని చేస్తాయో పోలీస్ సిబ్బంది విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ రమేష్, హెూంగార్డ్ గోరి, పోలీస్ సిబ్బంది ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## 18న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-మద్నూర్

మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 18న గురువారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాగ్మారే లక్ష్మీబాయి అధ్యక్షతన జరుగుతుందని, మండల పరిషత్ అభివృద్ధి అధికారిని పరుచూరి రాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి మండల ప్రాదేశిక సభ్యులు సంబంధిత శాఖల మండల అధికారులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలనిఎంపీడీవో కోరారు.

## ఎంపీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న మైనారిటీలు

నవతెలంగాణ-బోధన్

రంజాన్ మాసం చివరి రోజును పురస్కరించుకుని బుధవారం బోధన్ ఎంపిపి బుద్దె సావిత్రి రాజేశ్వర్ సాలూర మండల కేంద్రంలోని తన స్వగృహంలో మైనారిటీ సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్షల సందర్భంగా వారికి ఫలాహారాలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రంజాన్ మాసం సందర్భంగా మైనార్టీ సోదరులు ఎంతో దీక్షతో కఠినమైన ఉపవాసాన్ని పాటిస్తారని, వారికి అల్లా ఎల్లప్పుడు చల్లగా చూడాలని ఆకాంక్షించారు. గత 30 సంవత్సరాలుగా తాము రంజాన్ పండగ సంధర్బంగ గ్రామంలోని మైనారిటీ సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేజీ గంగారాం, స్వామిగౌడ్, ఇల్తెపు గంగారాం ఎల్మదత్తు, శివకాంత్ పటేల్, శివరాజ్ పటేల్, ఘంటే లక్ష్మణ్‌పటేల్, గాండ్ల రాజేశ్వర్, శ్రీరామ్ గంగాధర్, సాలూర షకిల్, యూసుఫ్, ఖాదర్, చంటి, బండే గంగాధర్, రహమత్ తదితరులు పాల్గొన్నారు.

## అల్లా దీవెనలు అందరిపై ఉండాలి

- బీఆర్ఎస్ ఎంపి అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని భారత రాష్ట్ర సమితి పార్టీ నిజామాబాద్ లోక్ సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ముస్లిం సోదర, సోదరిమణు శుభాకాంక్షలు తెలిపారు. ఆ అల్లా దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని, రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు చేసే ఉపవాస దీక్షలు ఫలించాలని బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు.సమాజానికి ఉపయోగపడే అల్లా బోధనలను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలని చెప్పారు. అల్లా బోధనలు సమాజానికి ఆదర్శమని, అల్లా దయవల్ల సమాజం బాగుండాలని ప్రకృతి కరుణించాలని ఆకాంక్షించారు. ముస్లిం సోదరులకు ఎంతో పవిత్రమై రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో సంతోషంగా కలిసిమెలసి జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదినం సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ శుభాకాంక్షలు తెలిపారు.

## విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**నవతెలంగాణ-ఆర్మూర్**



మండలంలోని గోవింద్ పెట్ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు బుధవారం నూతన కార్యవర్గంలో ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుగా శృంగారం వెంకట కిషన్, పుస్కూరు ముఖేష్‌లను ఎన్నుకున్నారు. వీరికి బాధ్యతలను గత సంఘ బాధ్యులు శృంగారం శ్రీనివాస్, పుస్కూరు గంగ శేఖర్‌లు అప్పగించారు. సంఘానికి సలహాదారులుగా చొక్కల రాజేశ్వర్, పుస్కురు గంగామోహన్, శృంగారం శ్రీకాంత్, శృంగారం వెంకటేశ్వర్‌లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గంను సన్మానించారు.

## మహిళా జర్నలిస్టుల సంఘం ఎన్నిక



ఎన్నికైన మహిళా జర్నలిస్టు సంఘం సభ్యులు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

నిజామాబాద్ జిల్లా మహిళా జర్నలిస్ట్ అసోసియేషన్ ఎన్నికలు బుధవారం నిర్వహించారు. నిజామాబాద్‌లోని వినాయకనగర్‌లో ఈఎన్నిక నిర్వహించారు. ఈ కమిటీ అధ్యక్షురాలిగా బైస సంగీతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీలో జనరల్ సెక్రటరీగా సోని, కోశాధికారిగా అనిత, వైస్ ప్రెసిడెంట్‌గా ఆశ్ర, సహాయ సెక్రటరీగా లావణ్య, కమిటీ మెంబెర్స్‌గా అర్చన, తులసి, సౌందర్య, దీపికా, వాణి, ప్రసన్న, కావ్య, రోషిని, సంజన, రజిత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు బైస సంగీత మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా మీడియాలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్ట్‌లు, డెస్క్, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలలో పనిచేస్తున్న మహిళలు ఈ కమిటీ సభ్యులుగా ఉంటారని ఆమె తెలిపారు.

## నష్టపరిహారం అందించేలా చూస్తాం

- జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్
- వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంట పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

**నవతెలంగాణ-వర్ని**

చందూరు మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి అకాల వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న 60 ఎకరాల పంటచేలను జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ పరిశీలించారు. ధాన్యం నేల రాలి నష్టపోయారని ఆయన అన్నారు. నష్టపోయిన రైతుల వివరాలను వారికి సంబంధించిన పత్రాలను ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్ కూడా అందిస్తామని రైతులకు తెలిపారు. ఆయనతోపాటు మండల వ్యవసాయ విస్తరణ అధికారి నగేష్ రెడ్డి, బాధితులైన రైతులు ఉన్నారు.

## తొగర్ల సురేష్‌కు ఉత్తమ సేవా పురస్కారం



సేవాపురస్కారం అందుకుంటున్న తొగర్ల సురేష్

**నవతెలంగాణ-ముప్కాల్**

'విశ్వ తేజస్ ట్రెనింగ్, కౌన్సెలింగ్ సర్వీసెస్' నిజామాబాద్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో భాగంగా ముప్కాల్ పోలీస్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న తొగర్ల సురేష్ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. శ్రీ క్రోధినామ సంవత్సరం సందర్భంగా ఉత్తమ సేవా ఉగాది పురస్కారాలను పలువురు ప్రముఖులకు అందజేశారు. ఈ సందర్భంగా ముప్కాల్ పోలీస్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ప్రముఖ కవి, రచయిత, సామాజిక సేవకులైన తొగర్ల సురేష్ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం పురస్కార గ్రహీత తొగర్ల సురేష్ మాట్లాడుతూ.. ఒకవైపు వృత్తినే దైవంగా భావిస్తూ, మరోవైపు కవి, రచయితగా, సామాజిక సేవకులుగా సేవలందిస్తున్న నన్ను గుర్తించి ఇట్టి పురస్కారాన్ని అందించినందుకు 'విశ్వ తేజస్ ట్రెనింగ్, కౌన్సెలింగ్ సర్వీసెస్' నిజామాబాద్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రముఖ మెజిషియన్, సైకాలజిస్ట్ జాదూ యుగేందర్ రంగనాథ్, మోటివేషనల్ స్పీకర్, సైకాలజిస్ట్ తిరునగరి శ్రీహరి, పలువురు కవి, రచయితలు గనుపురం దేవేందర్, పంచరెడ్డి లక్ష్మణ్, నారాల సుధాకర్, దారం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మున్సిపల్ చైర్మన్ కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్ చేరిన మాజీ మున్సిపల్ చైర్మన్, తదితరులు

**నవతెలంగాణ-భీంగల్**

భీంగల్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్, ప్రస్తుత కౌన్సిలర్ మల్లెల రాజశ్రీ, ఆమే భర్త బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్ నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్‌రెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ప్రజాపాలనకు ఆకర్షితులై చేరామన్నారు. ఈ సందర్భంగా ముత్యాల సునీల్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గం లో పార్టీ పటిష్టతకు పనిచేసే జీవన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోధిరే స్వామి, పట్టణ అధ్యక్షుడు జెజె నర్సయ్య, పల్లే శేఖర్, కోరాడి లింబాద్రి, రంజిత్, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావ్యతిరేక బీజేపీని ఓడించండి

- టిడిఎస్ఎఫ్

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

ప్రజా వ్యతిరేక మోడీ ప్రభుత్వాన్ని, బీజేపీ పార్టీనీ ఓడించండి అని టిడిఎస్ఎఫ్ నాయకులు అన్నారు. తెలంగాణ సోషల్ డెమొక్రటిక్ ఫురం (టిడిఎస్ఎఫ్) జిల్లా సమన్వయ కమిటీ సమావేశం ఎన్ ఆర్ భవన్, కోటగల్లిలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా టీడీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, చైర్మన్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేటు అనుకూల విధానాలు పాటిస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. విద్యా, వైద్య రంగాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రయత్నాలు చేస్తుందన్నారు. పదేళ్ళుగా దేశ సంపదను, ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. నిరుద్యోగిత రేటు విపరీతంగా పెరిగిందన్నారు. మోడీ ప్రభుత్వ విధానాల వల్ల కార్పొరేట్ల ఆదాయం 30 శాతం వృద్ధి చెందగా, పేద మధ్యతరగతి ప్రజల ఆదాయం 11 శాతం పడిపోయిందన్నారు. ధరలు 30 శాతం నుండి 56 శాతం వరకు పెరిగాయన్నారు. పెట్రోలు ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం పన్నుల వాటాను 243 శాతానికి పెంచిందన్నారు. 2023లో కార్పొరేట్లకు 2.14 లక్షల కోట్లు బ్యాంకు రుణాలను మాఫీ చేశారని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని, బీజేపీ పార్టీనీ పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలన్నారు. అందుకోసం ప్రజలను విద్యార్థులను యువతను కార్మికులను రైతాంగాన్ని చైతన్యం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అందులో భాగంగానే ఈనెల 27 న జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్ మున్నూరు కాపు సంఘం భవనంలో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థులు, యువత, కార్మిక, కర్షకులు ఈ సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీఎస్ఎఫ్ రాష్ట్ర సమన్వయకర్త నైనాల గోవర్ధన్, కో కన్వీనర్లు ఎం.హన్మేష్, చలపతిరావు, జానకిరాములు, వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ఏ.పాపయ్య ఎం.నరేందర్, ఎం.వెంకన్న, ఎం.సుధాకర్, ఎస్ దాసు, వై.ఓమయ్య, భూమయ్య, రాజన్న, సాయరెడ్డి, శివకుమార్, శివాజీ, రాజశేఖర్, మురళీ, రఘురాం, రాజేశ్వర్, అనిల్, రంజిత్, కిషన్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీఎస్ఎఫ్ నాయకులు

## గ్రంథాలయానికి కూలర్ల వితరణ

**నవతెలంగాణ-బోధన్**

లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ఆధ్వర్యంలో బుధవారం పాఠకుల సౌకర్యంకోసం కూలర్లను అందించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని పాఠకుల సౌకర్యార్థం లయన్స్ బండారి ముత్తయ్య, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ఆధ్వర్యంలో రెండు కూలర్లు ఇచ్చారు. ఈ సందర్భంగా లయన్స్ క్యాబినెట్ సెక్రటరీ యార్లగడ్డ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పాఠకులకు బోధన్ గ్రంథాలయం అనేక సంవత్సరాలుగా ఉత్తమ సేవలు అందజేస్తుందని గుర్తు చేశారు. పోటీ పరీక్షల నిమిత్తం బోధన్ గ్రంథాలయంలో అనేక పుస్తకాలు ఏర్పాటు చేసి సేవ అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రంథాలయం సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని కాంపిటేటివ్ పరీక్షలలో మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మురహరి, దత్తాత్రి రావు కులకర్ణి, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి అధ్యక్షులు చదలవాడ వెంకటేశ్వరరావు, కోశాధికారి రాధాకృష్ణమూర్తి, ప్రతినిధులు శ్రీనివాసరాజు, లక్ష్మీకాంత్‌రెడ్డి, గాంధీ, హరిబాబు, ఐఆర్ చక్రవర్తి, రమణరెడ్డి, నర్సారెడ్డి, గ్రంథాలయ పాలకులు సందీప్, రమాదేవి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కూలర్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

## దానం, ధర్మం, నియమాలకు ప్రతీక రంజాన్

**మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నా**

**నవతెలంగాణ-ఆర్మూర్**



దానం, ధర్మం, నియమ నిష్ఠలకు ప్రతీక రంజాన్ అని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నా అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతను జోడిస్తూ కఠిన నియమాలతో ఉపవాస దీక్ష పాటించే రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని అన్నారు. ఇస్లాం శాంతి, మతసామరస్యం ఎదుటివారిపై ప్రేమ ఆప్యాయతలు చాటి చెప్పడం, నెల మొత్తం జరిగే ఈ ప్రత్యేక నమాజులో దివ్య ఖురాన్ మొత్తం పఠనం చేయడం జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ మాంరగంగారెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ రెడ్డి,,మున్సిపల్ చైర్ పర్సన్ వన్నెల్ దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్ తదితరుల సహాయ సహకారాలతో అభివృద్ధికి నిర్విరామ కృషి చేస్తామని అన్నారు.

## రంజాన్ నేపద్యంలో ట్రాఫిక్ మళ్లింపు

**పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ వెల్లడి**

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

నిజామాబాద్ నగర ప్రజలకు రంజాన్ పండగ నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ బుధవారం తెలిపారు. గురువారం రంజాన్ పండుగ సందర్భంగా ఖిల్లా ఈద్గా, బోధన్ బస్టాండ్ ఈద్గా, పులాంగ్ ఈద్గాలలో, ముస్లీం సోదరులు ప్రార్ధనలు చేస్తారు. కాబట్టి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ దారి మళ్లింపులు ఉంటాయని, ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది సూచించిన విధంగా వెళ్లాలని తెలియజేశారు. బోధన్ వైపు వెళ్లేవారు ఆర్‌టిసి బస్ స్టాండ్ నుంచి ఫ్లై ఓవర్ బ్రిడ్జి శివాజీ చౌక్, గంజ్, నిజాంకాలనీ మీదుగా అర్సాపల్లి నుంచి బోధన్‌కు వెళ్లాలని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి బోధన్ వైపు వెళ్లేవారు మాదవనగర్ బైపాస్ నుంచి కంఠేశ్వర్ బైపాస్, న్యూ కలెక్టరేటు ద్వారా అర్సావల్లి మీదుగా బోధనకు వెళ్లాలని సూచించారు. బోధన్ నుంచి నిజామాబాద్ వచ్చేవారు అర్సాపల్లి సర్కిల్ నుంచి న్యూ కలెక్టరేటు మీదుగా కంఠేశ్వర్ బైపాస్, ఎన్‌టిఆర్ సర్కిల్, ఆర్‌టిసి బస్ స్టాండ్‌కు రావాలి. కావున నగర ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు.

## దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం చెల్లించాలి : సీపీఐ(ఎంఎల్)

**నవతెలంగాణ-బోధన్**

గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు, వడగళ్ల వానకు వరి, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, ఇతర ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బ తిన్నాయని వాటికి నష్టపరిహారం అందించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ బోధన్ డివిజన్ కార్యదర్శి వరదయ్య బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చేతికోచ్చిన పంట ప్రకృతి వైపరీత్యంమూలంగా నష్టం జరగడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురైతున్నారని పేర్కోన్నారు. కావున తక్షణం రాష్ట్ర ప్రభుత్వం దెబ్బ తిన్న పంటలకు నష్ట పరిహారం ఎకరాకు రూ.30,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. తేమ, తాలు, తరుగుతో సంబంధం లేకుండా ప్రభుత్వం ధాన్యం, ఇతర పంటలు కోనుగోలు చేయాలని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు కోత్త రుణాలు, పెట్టుబడి సాయం చేయాలని సూచించారు. రూ.2లక్షల రుణ మాఫీ చేయాలని, కౌలు రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయం తక్షణం అమలు చేయాలని, వరి పంటకు రూ.500 బోనస్ అమలు చేయాలని పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

## జిల్లా ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు

- కలెక్టర్, కమిషనర్

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కంఠేశ్వర్**

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా వేసవి తీవ్రతలోనూ నియమ నిష్ఠలతో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు నిర్వర్తించడం ఎంతో గొప్ప విషయమన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. నెల రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షలు, దాన ధర్మాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలలో నిమగ్నమైన ముస్లిం సోదరులు, అదే స్ఫూర్తితో గురువారం నాటి ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ను కూడా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు.

**కంఠేశ్వర్ :** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలందరికి నేడు రంజాన్ పండుగ సందర్భంగా పోలీస్ శాఖ తరపునకమిషనర్ కల్మేశ్వర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎల్లప్పుడు ప్రజలు పోలీస్ సిబ్బంది స్నేహపూర్వకంగా సోదర భావంతో మెలగాలన్నారు. అందరూ వారి కుటుంబసభ్యులతో సుఖ సంతోషలతో ఉండాలని కోరారు. సమాజంలో శాంతి స్థాపనకు అందరు కృషి చేయాలని తెలిపారు.

## ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి

**నవతెలంగాణ నిజామాబాద్ సిటీ**

నిజామాబాద్ లో ఉన్న డైట్ కళాశాలలో ఉర్దూ మీడియం కి సంబంధించిన డిప్యూటేషన్‌లో ఉన్న ఉపాధ్యాయులను యధావిధిగా విధులను కొనసాస్తూ, అదే తరుణంలో రెగ్యులర్ ఫ్యాకల్టీని నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్యు నగర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరెట్ ఏఓ ప్రశాంత్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్యు నిజామాబాద్ నగర అధ్యక్షులు ఎస్కే అశుర్ మాట్లాడుతూ నగరంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఉర్దూ మీడియంకు సంబంధించి గతంలో రెగ్యులర్ ఫ్యాకల్టీ సబ్జెక్టుల వారీగా అందరూ ఉండేవారని, వారు రిటైర్డ్ అయిన తర్వాత ఒక్క ఫ్యాకల్టీని కూడా ప్రభుత్వం నియమించలేదన్నారు. దీంతో సిలబస్ పూర్తికాకపోవడంతో టెట్,డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చిన తరుణంలో విద్యార్థులు అయోమయంగా ఉన్నారన్నారు. చాత్రోపాధ్యాయులకు సిలబస్ పూర్తి కావడం కాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి డిపుటేషన్ లో ఉన్నటువంటి ఉపాధ్యాయులను కొనసాగిస్తూ రెగ్యులర్ ఫ్యాకల్టీ ని వెంటనే నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్యు డైట్ కళాశాల అధ్యక్షులు తరుణ్, కళాశాల నాయకులు భోజన్న, సుకుమార్, కతిజ, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇండోర్ స్టేడియం పనులు ప్రారంభం



**నవతెలంగాణ-ముప్కాల్**

మండల కేంద్రంలోని 'ఇండోర్ స్టేడియం' షెడ్డు నిర్మాణం పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడా రంగ నిపుణులు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి గంగాధర్ మాట్లాడుతూ.. గత సంవత్సరం నవంబర్ నెలలో ఇండోర్ స్టేడియంకు భూమిపూజ చేయడం జరిగిందని అన్నారు. స్టేడియం నిర్మాణం కోసం పలువురు దాతలు ముందుకు రావడంతో షెడ్డు నిర్మాణ పనులను ప్రారంభించామని తెలిపారు. స్టేడియం నిర్మాణం కోసం మరికొంతమంది దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు టి.సాయన్న, జక్కుల ప్రవీణ్, గద్దల గంగారాం, మోతే గంగారెడ్డి, సంజీవ్ థామస్, గొర్రె చిన్న రాజన్న, ద్యావతి శివలింగం, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం

**నవతెలంగాణ-సిరికొండ**

మండలంలోని ఆదర్శ పాఠశాల ఎఫ్ఎసి ప్రిన్సిపాల్‌గా పాల శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఇదే పాఠశాలలో గత కొన్ని సంవత్సరాలుగా లెక్చరర్‌గా పని చేసిన పాల శ్రీనివాస్, ఇంతకుముందున్న ప్రిన్సిపాల్ సునీత ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ప్రిన్సిపాల్ పదవి నుంచి తప్పుకుని ఈయనకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఆదర్శ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, విద్యాభివృద్ధికి తోడ్పడుతానని అన్నారు. ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుల బృందం విద్యార్థులకు మంచి విద్యాబోధన కొనసాగుతుందని తెలిపారు.

## పలు కుటుంబాలను పరామర్శ

**నవతెలంగాణ-సిరికొండ**

మండలంలోని గడ్కోల్ గ్రామంలో ఇటీవల కాలంలో మరణించిన పలు కుటుంబాలను డిసిసి ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. కాంగ్రెస్ నాయకుడు పెద్ద రాజన్న ఆరోగ్యం క్షీణించి మరణించిన విషయం తెలుసుకొని ఆయన కుమారుడు ఆటో రాజేశ్వర్ కుటుంబానికి రూ.5000 ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు బద్దం రామచంద్రారెడ్డి, సంతోష్‌రెడ్డి, లింబాద్రి, భానుచందర్, రమేష్‌రెడ్డి, గంగారెడ్డి, భాస్కర్ రెడ్డి, బసంత్ రెడ్డి, బాలయ్య, సుమన్, హేమంత్, రాకేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల నడుమ పుట్టినరోజు వేడుకలు

**నవతెలంగాణ-ముప్కాల్**

లయన్స్ క్లబ్ ముప్కాల్ అధ్యక్షులు ముస్కు రాజేశ్వర్ మనుమరాలు ఆరాధ్యరెడ్డి 3వ జన్మదిన వేడుకలను కిసాన్‌నగర్ గ్రామంలోని 'నచికేతన్ ఆవాసం'లో బుధవారం విద్యార్థుల నడుమ ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరాధ్యరెడ్డి తల్లిదండ్రులు, ముస్కు రాజ్‌కుమార్ మనస్విని, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముస్కు రాజేశ్వర్, సెక్రటరి కట్ట మహేష్, కోశాధికారి జక్కుల రాము, క్లబ్ సభ్యులు శ్రీనివాస్, సిద్ధ రమేష్, ఆవాసంలోని ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 12న డాక్టర్ పి.రామ్మోహన్ రావుకు అభినందన సభ

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**

జనవిజ్ఞాన వేదిక జాతీయ గౌరవ అధ్యక్షులు డాక్టర్ పి.రామ్మోహన్‌రావు కు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారు శాస్త్రీయ, సామాజిక, సాంఘీక రంగాల్లో వారు చేసిన కృషికి గాను 2022 నాగసూరి గౌరమ్మ సంజీవయ్య కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. దీన్ని పురిష్కరించుకొని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అభినందన సభ ఈనెల 12న ఖలీల్ వాడి లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉంటుందని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కోయెడి నర్సింలు, రాష్ట్ర అధ్యక్షులు నర్రా రామారావు తెలిపారు. ఈ అభినందన సభకు అందరూ ఆహ్వానితులే అని, సకాలంలో విచ్చేసి సభను విజయ వంతం చేయాలని కోరారు.

## విప్లవ సాంస్కృతిక సేనాని కామ్రేడ్ కానూరి

**నవతెలంగాణ-సిరికొండ**

విప్లవ సాంస్కృతిక సేనాని, కామ్రేడ్ కానూరి వెంకటేశ్వరరావు అని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి.ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని రావుట్ల గ్రామంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థపకులు, అరుణోదయ సంస్కృతిక సమాఖ్య, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో కానూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధరైతంగా పోరాటం, శ్రీకాకుళ గిరిజన రైతంగా పోరాటాల స్ఫూర్తితో విప్లవ సంస్కృతికోద్యమం వైపు నిలిచి విప్లవ సంస్కృతిక రంగం అభివృద్ధి కోసం విశేషమైన కృషి చేసిన గొప్ప కళాతపస్వి అయన అన్నారు. స్వతగా విప్లవ గేయాలను రాసి పాడిన విప్లవ గాయకుడిగా జనం గుండెల్లో నిలిచిన గొప్ప కళఅన్వేషి అని అయన కొనియాడారు. కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పిట్ల రామకృష్ణ, ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవారం, పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు గోదావరిలు



## కాంగ్రెస్ పార్టీలో ఏర్గట్ల జడ్పీటీసీ చేరిక


కాంగ్రెస్‌లో చేరిన జడ్పీటీసీ

**నవతెలంగాణ-ఏర్గట్ల**

ఏర్గట్ల జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్ బీఆర్ఎస్ పార్టీ నుండి బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్‌తోపాటు బీఆర్ఎస్ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు సున్నపు అంజయ్య, దమ్మన్నోళ్ల శ్రీనివాస్, అన్వర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్, డీసీసీ డెలిగేట్ జీవన్ రెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ పెద్దిరెడ్డి రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రేండ్ల రమేష్, రొక్కెడ సంజీవ్ పాల్గొన్నారు.

## బంకుల్లో పెట్రోల్ నిల్



**నవతెలంగాణ-మాక్లూర్**

మండలకేంద్రంలోని రెండు బంకుల్లో పెట్రోల్ లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం మండల కేంద్రంలో రెండు బంకుల్లో పెట్రోల్ లేకపోవడంతో వాహనదారులు బంకులకు వచ్చి వెనుదిరుగు తున్నారు. రెండు రోజులుగా వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పెట్రోల్ వెంటనే తీసుకు రావాలని వాహనదారులు కోరుతున్నారు. బంకు యజమానులు బుధవారం రాత్రి వస్తుందని తెలిపారు.

# అధికారంలోకి రాగానే రెండు లక్షల రుణమాఫీ

- కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడేది కాంగ్రెస్ పార్టీ
- కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంటు అభ్యర్థి జీవన్ రెడ్డి
- కాంగ్రెస్ పార్టీ ఎన్నికల విస్తృత స్థాయి సమావేశం

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఆ పార్టీ నిజామాబాద్ పార్లమెంటు అభ్యర్థి జీవన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని తెలిపారు. బుధవారం వేల్పూర్ మండలంలోని లక్కోర గ్రామ సమీపంలోని ఏఎన్‌జి ఫంక్షన్ హాల్లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అనేక సాగునీటి ప్రాజెక్టులను నిర్మించిన ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా, ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు ఉన్న సాగునీటి విషయంలో అదనంగా చేసింది ఏమీ లేదన్నారు. బాల్కొండ నియోజక వర్గ కేంద్రంలో బస్టాండ్ లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. తాను స్వయంగా బాల్కొండలో పరిస్థితిని చూశానని, వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు రోడ్డుపైన నిలబడి బస్సుల కోసం వేచి చూస్తున్నారని ఇది నిజాం కాదా? అని జీవన్ రెడ్డి ప్రశ్నించారు. అంతేకాకుండా బాల్కొండలో సమీకృత మార్కెట్ యార్డు లేని కారణంగా మాంసం విక్రయదారులు రోడ్డు పైన రెండు వైపులా మాంసం విక్రయిస్తున్నారన్నారు. బాల్కొండ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో చేపలు విక్రయిస్తున్న విషయం నిజాం కాదా? అని ప్రశాంత్ రెడ్డిని ప్రశ్నించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం స్వల్ప మెజారిటీతో ప్రశాంత్ రెడ్డి గెలుపు గెలుపు కాదని, నైతికంగా సునిల్ కుమార్ గెలిచారని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రిగా ఉండి బాల్కొండ నియోజక వర్గ కేంద్రానికి ఏం చేసావని ప్రశాంత్ రెడ్డిని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ అవినీతి కుంభ కోణాలు, భీమ్ గల్ ప్రాంతంలో గంజాయి సాగుకు ప్రోత్సహించింది నిజం కాదా? అన్నారు. నీ అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించిన సంగతి అందరికి తెలిసిందేనన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇస్తున్నానని, ఈ సందేశాన్ని అన్ని గ్రామాలకు తీసుకువెళ్లాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. పసుపు, ఎర్ర జొన్న పంటలకు మద్దతు ధర ఏమైందో ఎంపీ అరవింద్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ గత 15 ఏళ్లలో కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాల వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. ప్రజలు బాగుండాలంటే కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండాలన్నారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, తెలంగాణ ఆంధ్ర నేషనల్ యూత్ ప్రాజెక్టు, యునైటెడ్ నేషన్స్ ఆఫ్ యూత్ ఆర్గనైజేషన్, దక్షిణ ఆసియా మైత్రి సదస్సు కోశాధికారి ముత్యాల సునిల్ కుమార్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాలలో బాల్కొండ కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. గత ప్రభుత్వం కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించిన కాంగ్రెస్ కార్యకర్తలు భయపడకుండా సహనంతో ఓపిక పట్టారన్నారు. భీంగల్ ప్రాంతంలో మత్తు మాదక ద్రవ్యాలు, గంజాయి అక్రమ రవాణా జరిగితే దీనికి వత్తాసు పలికి యువకుల భవిష్యత్తు నాశనం చేసిన ఘనత గత ప్రభుత్వంలో మంత్రిగా చేసిన ప్రశాంత్ రెడ్డిది కాదా.. అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే అమాయకులైన వారిపై గంజాయి అక్రమ రవాణా పేరుతో అక్రమ కేసులు పెట్టించిన విషయం ప్రజానికానికీ తెలిసిందేనని అన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జీవన్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ తాహిర్ బిన్ హందాన్, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వినయ్ రెడ్డి, ఎన్‌డిసిసిబీ చైర్మన్ రమేష్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సదానంద్, నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

## టెట్ దరఖాస్తు చివరి తేదీ పొడిగింపు

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**

22-03-2024 నోటిఫికేషన్ ప్రకారం టెట్ - 2024 కి హాజరు కావాలనుకునే అభ్యర్థులందరూ ఆన్‌లైన్ దరఖాస్తును సమర్పించడానికి గడువు పొడిగించారని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్వి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎడిట్ ఆప్షన్‌తో ఏప్రిల్ 11 నుండి ఏప్రిల్ 20 వరకు పొడిగించారని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు


కాంగ్రెస్‌లో చేరిన పలువురు

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

మండలంలోని కొత్త చెరువు తండా, కోనాపూర్, వాసం గట్టు తండాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం లకోరా ఏఎన్జీ గార్డెన్‌లో జరిగిన నిజామాబాద్ పార్లమెంట్ బాల్కొండ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కొత్త చెరువు తండా తాజా మాజీ సర్పంచ్ లకావత్ సంతోష్ నాయక్, కోనాపూర్ తాజా మాజీ ఉప సర్పంచ్ టేకుల జలందర్, వాసంగట్టు తండా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గుగులోత్ రమేష్, నాయకులు ఎలేటి నర్సారెడ్డి తదితరులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఈ సందర్భంగా ఆ పార్టీలో చేరిన నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అన్నదానం

**నవతెలంగాణ-ఆర్మూర్**

జిల్లా నూర్ భాషా దూదేకుల వృత్తి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ షాదుల్లా జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా పట్టణంలో నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వారి సన్నిహితులు తదితరులు పాల్గొన్నారు.

## ఫైర్‌స్టేషన్‌కు ఎమర్జెన్సీ ఎక్విప్మెంట్ అందజేత


ఎక్విప్మెంట్‌ను అందజేస్తున్న టోల్వే అధికారులు

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

అత్వంగ్ డిచ్ పల్లి టోల్వే ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ సోషల్ రెస్పాన్సిబుల్ (సిఎస్ఆర్) ఇందల్‌వాయి మండలంలోని గన్నారం గ్రామ స్వాగత తోరణం వద్ద ఉన్న అగ్నిమాపక శాఖకు బుధవారం ఎమర్జెన్సీ ఎక్విప్మెంట్‌లను అందజేశారు. (ఫోల్డబుల్ స్ట్రెచర్స్ -20, సేఫ్టీ బెల్ట్ -25, అంబూ బ్యాగ్స్-25)లను అందజేశారు. కార్యక్రమంలో అత్వంగ్ టోల్ వే ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్టు మేనేజర్ అనిల్ కుమార్ సింగ్ మాట్లాడుతూ అగ్ని ప్రమాద సమయంలో అగ్ని మాపక సిబ్బంది చేస్తున్న సహాయానికి తాము ఈ వస్తువులను అందజేస్తున్నామని వివరించారు. అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ భాను ప్రతాప్ మాట్లాడుతూ.. అత్యవసర వస్తువులు అందజేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సేఫ్టీ మేనేజర్ సతీష్, రూట్ ఆపరేషన్ మేనేజర్ విరాజ్ దేశ్‌పాండే, టోల్ ప్లాజా మేనేజర్ చలపతి రావు, మేయింటినెన్స్ మేనేజర్ కృష్ణకాంత్, నారాయణ మూర్తి, ఫైర్ ఇన్‌స్పెక్టర్ సురేష్, అగ్ని మాపక శాఖ అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఘనంగా శాలువాతో సన్మానించారు.

## సమన్వయంతో ప్రచారం చేయాలి

- ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి


మాట్లాడుతున్న పలువురు

**నవతెలంగాణ-ఆర్మూర్**

ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి బుధవారం భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఎన్నికల ప్రచారంలో ఎంపీ అభ్యర్థి బూర నర్సగౌడ్ తరుపున ప్రచారంలో పాల్గొన్నారు. భువనగిరి పార్లమెంట్ పరిధి ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో నూతన బిజెపి కార్యాలయాన్ని ముఖ్యఅతిథిగాహాజరై ప్రారంభించారు. జిల్లా, మండల, బూత్ స్థాయి నాయకులతో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ నుండి 10కి పైగా ఎంపీ స్థానాలు గెలిచి తీరాలని, అందుకు ప్రతి బూత్ స్థాయి నుండి జిల్లా నాయకుల సమన్వయంతో ప్రచారం చేయాలని అన్నారు. అత్యధిక మెజార్టీతో ఎంపీ అభ్యర్థి బీసీ అభ్యర్థి అయిన బూర నర్సయ్య గౌడ్ ని గెలిపించాలని కోరారు. బీసీ లకు సముచిత స్థానం కేవలం బీజేపీ తో సాధ్యం అని అందుకే బీజేపీ కి ఓటు వేయాలని గెలుపు లో మహిళలు యువత కీలకం అని రాకేష్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# మద్దతు ధరతోపాటు బోనస్ చెల్లించాలి

- ఏఐకేఎంఎస్

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

యాసంగి( రబీ సీజన్) వరి పంట రైతు చేతికొచ్చిన ఈ సందర్భంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరతో పాటు రైతుకు బోనస్ ధర 500 రూపాయలు చెల్లించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు వి కోటేశ్వరరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు ఆకుల పాపయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం అర్సపల్లిలో రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ... ప్రభుత్వం మద్దతు ధరకుధాన్యాన్ని కొంటామని హామీ ఇచ్చిన ఇప్పటివరకు ఇంకా పూర్తిస్థాయిలో కేంద్రాలను తెరవకపోవడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. తెరిచిన వాటిలో గోనె సంచులను అందించడం లేదని, కేంద్రాలలో భోజన సౌకర్యం, నీడ, నీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. కొన్న ధాన్యాన్ని 48 గంటల్లో రైతు ఖాతాలో డబ్బులు వేయాల్సి ఉండగా నెలల తరబడి ఆలస్యం జరుగుతుందని అన్నారు. తూకం వేయడంలో వారాల తరబడి ఆలస్యం జరుగుతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ధరతో పాటు రైతుకు 500 రూపాయలు బోనసును ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15 లక్షల ఎకరాలలో పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర నష్టాలు పాలయ్యారని అన్నారు. నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి 25 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరానికి 25 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ అమలు జరిపి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కొనుగోలు కేంద్రాల్లో తూకంలో మోసాన్ని అరికట్టి తడి తరుగు పేరుతో మోసానికి గురవుతున్న రైతును ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. ఖరీఫ్ సీజన్ లో కొత్త రుణాలు ఇవ్వాలని అన్నారు. ఈనెల 10 నుంచి 20 వరకు మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ఆందోళనకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు వేల్పూర్ భూమయ్య ,ముక్తి సత్యం, జే రాజు, సహాయ కార్యదర్శి డేవిడ్ కుమార్, నందగిరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు ఆకుల పాపయ్య, డి.సాయిరెడ్డి, గోపాల్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు కోటేశ్వరరావు

## బీమా చెక్కు అందజేత


బీమా చెక్కును అందజేస్తున్న మేనేజర్లు

**నవతెలంగాణ-మెండోర**

మండలంలోని బుస్సాపూర్ గ్రామంలో సల్ల భోజేందర్, సొంగల రాజన్న గతంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు బుస్సాపూర్ శాఖలో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యొజన పథకంలో రుపాయలు 436 చెల్లించి ఈ పథకంలో చెరారు. సల్ల భోజేందర్ గత సంవత్సరం డిసెంబర్‌లో మరణించారు. నామినీగా ఉన్న ఆయన భార్య సల్ల అనిత ఉన్నారు. సొంగల రాజన్న గత సంవత్సరం సెప్టెంబర్‌లో మరణించారు. నామినీగా ఆయన చిన్న కొడుకు స్టీఫెన్ ఉన్నారు. వారికి బీమా పరిహారం చెక్కులను తెలంగాణ గ్రామీణ బ్యాంకు బుస్సాపూర్ శాఖలో రీజినల్ మేనేజర్ డీవీస్ రామారావు, బ్రాంచ్ మేనేజర్ రాజేశ్వర్‌గౌడ్ నామినీలకు రెండులక్షల చొప్పున అందజేశారు. బ్యాంకు పరిధిలో 10మందికి రెండులక్షల చొప్పున చెక్కులను అందించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది కృష్ణ నాయక్ ,ఉమా మరియు ఐకేపీ సిబ్బంది తక్కల పద్మాలయ, సీఏలు, ఒబిలు, వీవో సభ్యులు, వివిధ సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో ఖాతాదారులు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యలపై ఎమ్మెల్యేకు విన్నపం

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**

మండలంలోని కలిగొట్ గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని బుధవారం కలిశారు. ఎమ్మెల్యేకు గ్రామ సమస్యలపై విన్నవించుకున్నారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి సానుకూలంగా స్పందించి ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల కోడ్ ఉన్నందున ఎలక్షన్ అనంతరం గ్రామ అభివృద్ధి కొరకు, సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు దేవరాజుల గంగాధర్, రైతు విభాగం అధ్యక్షులు వాకిటి పెద్ద భోజన్న, మాజీ సర్పంచ్ తలారి గంగాధర్, గ్రామ ఉపాధ్యక్షులు ఆకుల రవీందర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో పలువురు చేరిక

**నవతెలంగాణ-ఆర్మూర్**

నియోజకవర్గం బహుజన్ సమాజ్ వాది పార్టీ నియోజకవర్గ ఉప అధ్యక్షులు ఉమ్మడి నందిపేట మండల అంబేద్కర్ సంఘ గౌరవ అధ్యక్షులు సుంకరి నాగరాజు, డొంకేశ్వర్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు భూమేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ప్రొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి సమక్షంలో బుధవారం చేరారు. కార్యక్రమంలో రాజాగౌడ్ పాల్గొన్నారు.

# పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

ప్రభుత్వం అందించిన పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కోనాపూర్‌లో బీసీ బంధు పథకంలో భాగంగా రూ. లక్ష ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసుకొని నిర్వహిస్తున్న పలు షాపులను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బీసీ బంధు లబ్ధిదారులతో మాట్లాడారు. వ్యాపారం ఎలా సాగుతుంది.. బీసీ బంధు పథకంలో అందించిన ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న వ్యాపారాలు ఏంటి తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థికంగా వెనుకబడిన కులాలను గుర్తించి ప్రభుత్వం ఈ బీసీ బంధు పథకాన్ని ప్రవేశపెట్టిందని, ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. ప్రభుత్వ సహాయాన్ని దుర్వినియోగం చేస్తే నష్టపోతారని తెలిపారు. పలువురు లబ్ధిదారు నిర్వహిస్తున్న వ్యాపారాలను చూసి వారిని అభినందించారు.


షాపును పరిశీలిస్తున్న ఎంపీడీవో

## విద్యార్థులు కష్టపడి చదవాలి

- ప్రిన్సిపాల్ మహమ్మద్ విన్నాజ్
- కష్ణవేణి పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే



పాఠశాల గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు

**నవతెలంగాణ-ఆర్మూర్**

విద్యార్థులు చిన్ననాటి నుంచి కష్టపడి చదవాలని అప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని ప్రిన్సిపాల్ మహమ్మద్ విన్నాజ్ అన్నారు. పట్టణంలోని కష్ణవేణి ఉన్నత పాఠశాలలో ఎల్కేజీ, యూకేజీ విద్యార్థిని విద్యార్థులకు బుధవారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించినారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రైమరీ స్థాయి నుంచి హై స్కూల్ డిగ్రీ స్థాయి వరకు విద్యార్థులు కష్టపడి చదవాలని, అప్పుడే గ్రాడ్యుయేషన్ పట్టా పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్, ఉపాధ్యాయ బందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# కంటైనర్‌ను ఢీకొన్న బైక్

- ఒకరి పరిస్థితి విషమమం
- మరొకరికి స్వల్ప గాయాలు

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**

మండల కేంద్రంలోని మేవాథ్ దాబా దగ్గర కంటైనర్‌ను బైక్ ఢీకొనడంతో బైక్ మీద ఉన్న ఒకరి పరిస్థితి విషమంగా ఉందని, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి అని జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి బుధవారం తెలిపారు. పడకల్ తండాకు చెందిన కోలాబాపు సింగ్, ఆయన కూతురు కలిసి ఆర్మూర్ నుంచి బైక్‌పై వస్తున్నారు. జాతీయ రహదారి 44పై జక్రాన్‌పల్లి మేవత్ దాబా దగ్గర అకస్మాత్తుగా బ్రేక్ వేసి కంటైనర్‌కు ఢీకొనగా ఇద్దరికీ గాయాలయ్యాయి వారిరువురిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

## పెర్కిట్ సొసైటీ సీఈఓగా సాయి గారి లింబాద్రి



**నవతెలంగాణ-ఆర్మూర్**

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన సిఈఓగా సాయి గారి లింబాద్రి బుధవారం నియమితు లయ్యారు. ఈ సందర్భంగా చిన్ననాటి మిత్రులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

**నవతెలంగాణ-మెండోర**

పోచంపాడ్ ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం పాల్గొన్నారు. ముస్లిం సోదరులు కో- ఆప్షన్ మెంబర్ బాబ, మాజీ సర్పంచ్ మిస్బొద్దిన్‌ల సమక్షంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముస్లిం సోదరులతో అలాయ్ బలాయ్ చేసుకున్నారు. ఇఫ్తార్ విందులో విందు భోజనం చేశారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు, తదితరులు పాల్గొన్నారు.